## నిలువెత్తు నిర్లక్ష్యం..!



ఇక్కడ కనిపిస్తున్న చిత్రాన్ని చూడండి.. ఇదేదో క్రిస్మస్ చెట్టును తలపించేలా లేదూ.. మన విద్యుత్తు శాఖ నిర్లక్ష్యానికి నిలువెత్తు సాక్ష్యమిది.. ఎచ్చెర్ల మండలం పొన్నాడ వంతెన సమీపంలో విద్యుత్తు ఆర్ ఫ్లస్ త్రీ టవర్ నిండా ఇలా తీగలు పాకాయి. టవర్లు, ట్రాన్స్‌ఫార్మర్లు, సబ్‌స్టేషన్ల వద్ద నిర్వహణ కొరవడిందనేందుకు ఇదే నిదర్శనం.. ఎక్కడో మారుమూల ప్రాంతంలో ఈ స్తంభం ఉందంటే కనిపించలేదనుకోవచ్చు. శ్రీకాకుళం నగరాన్ని ఆనుకున్న ఉన్న ప్రాంతంలో ఇలా ఉన్నా పట్టించుకోకపోవడం దారుణం. ఈ విషయమై ఆ శాఖ ఈఈ యోగేశ్వరరావు వివరణ కోరగా పాదులను తొలగించి శుభ్రం చేసేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.
– న్యూస్‌టుడే, గుజరాతీపేట(శ్రీకాకుళం)

## పంచారామాలకు బస్సు సదుపాయం



కరపత్రం ఆవిష్కరిస్తున్న డీపీటీవో విజయ్‌కుమార్, అధికారులు

అరసవల్లి, న్యూస్‌టుడే: కార్తిక మాసం సందర్భంగా పంచారామాలకు బస్సులు నడపనున్నట్లు జిల్లా ప్రజా రవాణాధికారి ఎ.విజయ్‌కుమార్ తెలిపారు. శ్రీకాకుళంలో గురువారం దీనికి సంబంధించిన కరపత్రాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. నవంబరు 3, 10, 17, 24 తేదీల్లో సాయంత్రం 4 గంటలకు శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్‌లో బస్సులు బయలుదేరతాయని తెలిపారు. అమరావతి, భీమవరం, పాలకొల్లు, ద్రాక్షారామం, సామర్లకోటలో ఆలయాల్లో దర్శనానికి తీసుకెళ్తామని చెప్పారు. ఒకరికి టికెట్ సూపర్ లగ్జరీ రూ.2,400, అల్ట్రా డీలక్స్ రూ.2,350, ఎక్స్‌ప్రెస్ రూ.2 వేలుగా నిర్ణయించామన్నారు. పంబానది తీరం..శబరిగిరి మహోత్సవం పేరిట శబరిమలకు ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు 99592 25608, 99592 25609, 99592 25610, 99592 25611 నంబర్లకు ఫోన్ చేయాలని కోరారు.

# రణస్థలంలో ఎలివేటెడ్ కారిడార్..

- ఎన్‌హెచ్-16పై రెండు కి.మీ. మేర ఆరులైన్ల వంతెన
- రూ.252.42 కోట్లు మంజూరు చేసిన కేంద్రం

ఈనాడు డిజిటల్ శ్రీకాకుళం, న్యూస్‌టుడే, ఎచ్చెర్ల (రణస్థలం)

**రణస్థలం మండల కేంద్రంలో అపరిష్కృతంగా ఉండిపోయిన జాతీయ రహదారి విస్తరణకు ఎట్టకేలకు గ్రహణం వీడింది. బైపాస్ లేక ఊరి మధ్య నుంచి నిర్మిస్తారా అనే సందిగ్ధంలో ఏళ్ల తరబడి నిలిచిన పనుల ప్రతిపాదనకు కదలికొచ్చింది. ప్రస్తుత మున్న నాలుగు వరుసల మధ్యలోనే ఎలివేటెడ్ కారిడార్ (ఫ్లైవంతెన) నిర్మాణానికి చర్యలు తీసుకోనున్నారు. ఈ మేరకు గురువారం ప్రధానమంత్రి అధ్యక్షతన జరిగిన కేబినెట్ సమావేశంలో ఆమోదం లభించింది. ఇందుకోసం రూ.252.42 కోట్లు మంజూరు చేసినట్లు కేంద్రమంత్రి నితిన్‌గడ్కరీ ఎక్స్‌లో పోస్టు చేశారు.**

- రణస్థలం ప్రారంభంలోని పెట్రోల్ బంకు నుంచి రావివలస వరకు సుమారు రెండు కిలోమీటర్ల మేర ఆరులైన్లలో దీన్ని నిర్మిస్తారు. 800 మీటర్ల వరకు ఓపెన్ ఫ్లైవర్ నిర్మాణం చేపట్టనున్నారు. ఇందుకు సంబంధించి డీపీఆర్, టెండర్ల ప్రక్రియ పూర్తయినట్లుగా తెలిసింది. త్వరలో పనులు ప్రారంభంకానున్నాయి.



రణస్థలంలో నిర్మించనున్న వంతెన నమూనా

### గతంలోనే ప్రతిపాదనలు..

జాతీయ రహదారి-16లో విశాఖ-శ్రీకాకుళం-నరసన్నపేట మధ్య ఆరు లైన్లతో వంద కిలోమీటర్ల మేర రహదారి విస్తరణకు గతంలోనే చర్యలు తీసుకున్నారు. ఇందులో భాగంగా అటు ఆనందపురం నుంచి ఇటు నరసన్నపేట వరకు పనులు పూర్తయ్యాయి. రణస్థలంలో మాత్రం వదిలేశారు. 2016లో గెజిట్ నోటిఫికేషన్ ఇచ్చి బైపాస్ నిర్మాణం చేపట్టేందుకు గరికిపాలెం, రణస్థలం, లావేరులోని రావివలస రెవెన్యూ పరిధిలో 66 ఎకరాలను అధికారులు గుర్తించి 3.5 కి.మీ రహదారి నిర్మాణానికి నిర్ణయించారు. అప్పటికే ఎచ్చెర్ల వరకు పూర్తయింది. రణస్థలానికి వచ్చేసరికి హైవే అధికారులు 30 శాతం తగ్గించి నష్టపరిహారం ఇస్తామని చెప్పడంతో రైతులు, కొందరు వైకాపా నేతలు వ్యతిరేకించారు. దీంతో అటు బైపాస్ నిర్మాణం రణస్థలంలో ఆగిపోయింది.

### కూటమి రాకతో కదలిక..

కూటమి ప్రభుత్వం వచ్చిన నాలుగు నెలల్లోనే ఎలివేటెడ్ కారిడార్ ఫ్లైవంతెన నిర్మాణానికి నిధులు మంజూరు చేశారు. కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు, స్థానిక ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యే ఎన్ఈఆర్ చొరవతో కేంద్రం స్పందించింది. ఇక రణస్థలం మండల కేంద్రంలో అటు వ్యాపారులు, స్థానికులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ఉండేలా అధికారులు ప్రతిపాదనలు తయారు చేస్తున్నట్లుగా సమాచారం.

### సన్నాహాలతో గడిపేశారు..

వైకాపా ప్రభుత్వం వచ్చిన తర్వాత మూడేళ్లపాటు దీనిఊసే పట్టించుకోలేదు.. రెండేళ్ల కిందట బైపాస్ రద్దు చేసి ఫ్లైఓవర్ నిర్మాణానికి సన్నాహాలు చేశారు. టెండర్ల ప్రక్రియ పూర్తయిందని పనులు ప్రారంభమవుతాయని హడావుడి చేశారు. తర్వాత ఊసేలేదు. స్థానికుల నుంచి వ్యతిరేకత వస్తోందని పరిహారం పెద్ద మొత్తంలో చెల్లించాల్సి వస్తోందని వంటి కారణాలతో చేతులెత్తేశారు.

### అన్నివిధాలా అభివృద్ధి

జిల్లా అభివృద్ధికి వాణిజ్య, పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతున్న రణస్థలం ప్రాంతానికి ఎలివేటెడ్ కారిడార్ ఎంతో ఉపయుక్తంగా ఉంటుంది. రవాణా సౌకర్యం మెరుగుపడుతుంది. వాణిజ్య కార్యకలాపాలకు మరింత ఊతం ఇస్తుంది. ఈప్రాజెక్టు మంజూరు చేసినందుకు ప్రధాని మోదీ, కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు కృతజ్ఞతలు.
– కలిశెట్టి అప్పలనాయుడు, ఎంపీ

### గత పాలకుల నిర్లక్ష్యం వల్లే..

గత పాలకులు నిర్లక్ష్యంగా వదిలేసిన వంతెన నిర్మాణాన్ని కేంద్ర ప్రభుత్వం ద్వారా ఒత్తిడి తీసుకువచ్చి నిధులు మంజూరు చేయించాం. నియోజకవర్గ అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం. వీలైనంత తొందరగా వంతెన పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటాం.
– ఎన్.ఈశ్వరరావు, ఎమ్మెల్యే, ఎచ్చెర్ల

## గంజాయి గుట్టు విప్పిన రోడ్డు ప్రమాదం..

### వాహనంలో 500 కిలోలకు పైగా సరకు లభ్యం



గంజాయితో పట్టుబడిన వాహనం

మెళియాపుట్టి, న్యూస్‌టుడే: ఒడిశా రాష్ట్రం నుంచి గుట్టుగా జిల్లాలోకి వస్తున్న గంజాయిని ఓ రోడ్డు ప్రమాదం పట్టించింది.. ఈ ఘటనలో భారీస్థాయిలో గంజాయి లభ్యంకావడం కలకలం రేపింది. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.. ఒడిశా నుంచి మెళియాపుట్టి మీదుగా పలాస వైపు వెళ్తున్న బొలేరో వాహనం సవరజాడుపల్లి సమీపంలో ఓ ద్విచక్ర వాహనదారుడిని ఢీకొట్టడంతో అతనికి తీవ్ర గాయాలయ్యాయి. దీంతో బొలేరో వాహదారుడు పలాస వైపు పరారు కావడంతో స్థానికుల సమాచారం మేరకు టెక్కలిపట్నం వద్ద కొందరు యువకులు అడ్డుకునే ప్రయత్నం చేశారు. మళ్లీ వాహనాన్ని జాడుపల్లి తీసుకురావడంతో స్థానికులు ఈసారి అడ్డుకోవడంతో డ్రైవరు వాపహనాన్ని వదిలి పరారయ్యాడు. అనంతరం వాహనాన్ని తనిఖీ చేయగా పెద్దమొత్తంలో గంజాయి కనిపించింది. పోలీసులకు సమాచారమివ్వడంతో ఘటనా స్థలానికి చేరుకున్నారు. 500-600 కిలోల మేర గంజాయి ఉంటుందని, దీనివిలువ రూ.50-60 లక్షలు ఉంటుందని అంచనా. ఈ ఘటనలో గాయపడ్డ జి.సాయి అనే యువకుడిని స్థానికులు చాపర ఆసుపత్రికి, అక్కడి నుంచి టెక్కలి జిల్లా ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ఆదిత్యుని భక్తులకు కుక్కల బెడద




అరసవల్లిలో సూర్యనారాయణస్వామి ఆలయానికి వచ్చే భక్తులు వీధి కుక్కల బెడదతో బెంబేలెత్తుతున్నారు. దేవాలయంలో రోజువారీ కూలీ ప్రాతిపదికన పనిచేసే ఓ మహిళ ఇంద్రపుష్కరిణి వద్ద శిథిలావస్థకు చేరిన భవనంలో కొన్నేళ్లుగా వీధి కుక్కల్ని పెంచుతోంది. రోజూ ఉదయం, రాత్రి వేళ ఆహారం అందిస్తుండటంతో ఈ ప్రాంతంలో వాటి సంఖ్య భారీగా పెరిగింది. ఇంద్రపుష్కరిణి పరిసరాలు, మరుగుదొడ్ల వద్ద గుంపుగా తిరుగుతూ అక్కడే తిష్ఠ వేస్తున్నాయి. అటువైపు వచ్చే భక్తులుపై దాడి చేస్తున్నాయి. ఈ నెల 23న అనకాపల్లి జిల్లాకు చెందిన ఓ భక్తుడు కుటుంబ సభ్యులతో ఆదిత్యుని దర్శనానికి వచ్చారు. ఇంద్రపుష్కరిణి వద్దకు వెళ్తుండగా ఓ కుక్క అతని కాలిపై కరిచి గాయపర్చింది. ఇటీవల ఆలయ పరిసరాల్లో తరచూ భక్తులు కుక్కకాటు బారిన పడుతున్నారు. ఈ విషయమై ఆలయ ఈవో వై. భద్రాజీని 'న్యూస్‌టుడే' సంప్రదించగా శునకాలను పెంచకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. శునకాలు సంచరిస్తున్న విషయాన్ని పురపాలక సంఘం అధికారుల దృష్టికి తీసుకెళ్లి వాటి నివారణకు చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. – న్యూస్‌టుడే, శ్రీకాకుళం నగరం

# చేతిలో చట్టం.. చేసేదంతా అరాచకం..!

- కేసుకో ధర.. దారి పొడవునా దందాలు
- వివాదాస్పదంగా మారిన ఓ ఎస్సై తీరు

విధుల్లోకి వచ్చి ఎన్నో ఏళ్లు కాకపోయినా ఆ ఎస్సై తన పలుకుబడి ఉపయోగించి జిల్లా కేంద్రం చుట్టే తిరుగుతున్నారు. అతనిపై అవినీతి, అక్రమాల ఆరోపణలు తారస్థాయికి చేరాయి.

ఆయనో ఎస్సై స్థాయి పోలీసు అధికారి.. జిల్లా కేంద్రానికి సమీపంలోని ఓ స్టేషన్లో విధులు నిర్వహిస్తున్నారు. చట్టం తన చేతిలో ఉందని ఏమైనా చేయవచ్చనే భావనతో దందాలకు తెర లేపారు. పని చేస్తూ వచ్చిన ప్రతిచోటా తనదైన మార్కు చూపుకొంటూ వచ్చారు. శాంతిభద్రతలను కాపాడుతూ.. సమాజాన్ని రక్షించాల్సిన ఆయన అసాంఘిక కార్యకలాపాలను ప్రోత్సహిస్తున్నారు.. ఇసుక నుంచి గంజాయి వరకు అక్రమ రవాణా, జూదం నుంచి అర్ధరాత్రి దుకాణాల ద్వారా వసూళ్లకు పాల్పడటమే కర్తవ్యంగా పెట్టుకున్నారు. ఇటీవల ఆయన పని చేస్తున్న స్టేషన్లో మహిళా ఉద్యోగిపై అసభ్యకరంగా ప్రవర్తించిన విషయం వెలుగులోకి వచ్చింది. ఈ నేపథ్యంలో ఎస్సై తీరు ఆ శాఖలో చర్చనీయాంశంగా మారింది.
– ఈనాడు డిజిటల్ శ్రీకాకుళం

- నెల రోజుల కిందట అనధికారికంగా వెళ్తున్న 14 ఇసుక లారీలను పట్టుకున్నారు. వాటిలో రెండింటిపై కేసులు నమోదు చేశారు. మిగిలిన వాహనాల నుంచి ఒక్కో దానిపై రూ.5-10 వేల వరకు రాబట్టారు.
- ఇటీవల ఓ భవన నిర్మాణ కార్మికుడు మృతి చెందగా రాజీకి రూ.10 లక్షలు డిమాండ్ చేసినట్లు సమాచారం.
- వివాదం నేపథ్యంలో స్టేషన్‌కు వెళ్లిన దంపతుల నుంచి రూ.50 వేలు వసూలు చేశారు.
- ఓ మహిళ కుమార్తె వివాహానికి సంబంధించిన వివాదం పరిష్కారానికి రూ.లక్ష తీసుకున్నారు.
- బాలిక అదృశ్యమైందని తల్లిదండ్రులు ఫిర్యాదు చేయడానికి వెళ్తే బెదిరించి వారిపై కేసులు పెడతామని పంపేశారు.
- గంజాయి ముఠాలు, జూద నిర్వాహకులతో చేతులు కలిపి వారం, నెలవారీ వాటాలు తీసుకుంటున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.
- ఓ కారు ఢీకొని వెళ్లిన ఘటనకు సంబంధించి యజమాని నుంచి డబ్బులు తీసుకుని బాధితుడికి న్యాయం చేయకుండా కాలయాపన చేశారు.
- ఓ లాడ్జిలో జూదం, అసాంఘిక కార్యకలాపాలకు అడ్డు పడకుండా ఉండేందుకు యజమానుల నుంచి మామూళ్లు అందుకుంటున్నారు.

### డ్రైవరు ద్వారా దందాలు..

ఎస్సై చేసే ప్రతి దందా వెనుక అతని వ్యక్తిగత డ్రైవరు కీలకపాత్ర పోషిస్తున్నాడు. రోజువారీ, వారం, నెలవారీ వసూళ్లను అతనే సేకరిస్తున్నాడు. గతంలో పని చేసిన డ్రైవర్ మృతిపై అనేక అనుమానాలు వచ్చాయి. తనకు అనువుగా ఉండే వ్యక్తిని డ్రైవర్‌గా నియమించుకుని అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారని తెలిసింది.

### గతంలోనూ వివాదాస్పదమే..

గతంలో మరోచోట పని చేస్తున్న సమయంలో ఓ వివాదానికి సంబంధించి మానవ హక్కుల సంఘానికి ఫిర్యాదు అందడంతో విచారణకు ఆదేశించారు. అప్పుడు ఆయా అధికారులకు తాయిలాలు అందించి నివేదికను అనుకూలంగా రప్పించుకున్నట్లు సమాచారం. జిల్లా కేంద్రంలో పని చేసినప్పుడు అవినీతి ఆరోపణలతో మూడు నెలల్లోనే ట్రాఫిక్ విభాగానికి బదిలీ చేశారు. విధుల కంటే నిధులే ముఖ్యమన్నట్లు వ్యవహరిస్తున్న ఎస్సైపై జిల్లా అధికారులకు ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి.

## రాష్ట్ర పండగగా రథసప్తమి వేడుకలు

శ్రీకాకుళం నగరం, న్యూస్‌టుడే: అరసవల్లిలోని సూర్యనారాయణస్వామి ఆలయంలో రథసప్తమి వేడుకలను రాష్ట్ర పండగగా నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే గొండు శంకర్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఏటా మాఘమాసంలో నిర్వహించే రథసప్తమిని రాష్ట్ర పండగగా నిర్వహించాలనే తన అభ్యర్థన మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సానుకూలంగా స్పందించారని పేర్కొన్నారు. ఈ విషయమై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి ఉత్తర్వులు జారీ చేశారని తెలిపారు. అతి త్వరలో అధికారిక ఉత్తర్వులు జారీ అవుతాయని పేర్కొన్నారు. రాష్ట్ర పండగగా నిర్వహించడానికి అంగీకరించిన ముఖ్యమంత్రికి, అందుకు సహకరించిన కేంద్ర, రాష్ట్ర మంత్రులు కింజరాపు రామ్మోహన్నాయుడు, అచ్చెన్నాయుడికి కృతజ్ఞతలు తెలిపారు.



## రాష్ట్రాన్ని సర్వనాశనం చేసి ఇప్పుడు సుద్దులా..?

### జగన్‌పై మంత్రి అచ్చెన్న ఆగ్రహం

టెక్కలి, న్యూస్‌టుడే: అయిదేళ్లలో రాష్ట్రాన్ని సర్వనాశనం చేసి ఇప్పుడు సుద్దులు చెబుతున్నారని జగన్‌పై రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు మండిపడ్డారు. టెక్కలిలో గురువారం పర్యటించిన ఆయన జగన్‌పై వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో ఆడపిల్లలపై దాడులకు కర్త, కర్మ, క్రియ జగనేనన్నారు. రాష్ట్రాన్ని గంజాయి, మాదక ద్రవ్యాల హబ్‌గా మార్చేశారని ఆరోపించారు. గతంలో ఆయన ఇంటి ముందు అత్యాచారం జరిగితే ఈ రోజు వరకు చర్యల్లేవని విమర్శించారు. విజయనగరం జిల్లా గుర్లలో డయేరియా మరణాలకు పరామర్శకు వచ్చిన ఆయన అందుకు అయిదేళ్లు అధికారంలో ఉన్నప్పుడు క్లీనింగ్, క్లోరినేషన్ చేయకపోవడమే కారణమని గుర్తించకపోవడం దారుణమన్నారు. వారంలో అయిదు రోజులు బెంగళూరులో ఉండే ఆయన రెండు రోజులు ఇక్కడకు వచ్చి ప్రజల్ని రెచ్చగొట్టి వెళ్తున్నారని తెలిపారు. అయిదేళ్ల మద్యం వ్యాపారాన్ని తన చేతుల్లోనే ఉంచుకొని రూ.40 వేల కోట్లు తినేశాడని చెప్పారు. మద్యం తయారీ నుంచి దుకాణాల ఏర్పాటు, అమ్మకాలన్నీ ఆయనే చేశారన్నారు. కూటమి ప్రభుత్వంలో దరఖాస్తుల ద్వారానే ప్రభుత్వానికి రూ.1,900 కోట్ల ఆదాయం వచ్చిందని, ఏడు రోజుల్లో మద్యం ద్వారా రూ.700 కోట్లు ప్రభుత్వానికి సమకూరిందని, మరి గత అయిదేళ్లలో వచ్చిన సొమ్ము ఏమైందని ప్రశ్నించారు. నాసిరకం మద్యంతో మహిళల పుస్తెలు తెంచారని దుయ్యబట్టారు.



# అడుగు దూరాన.. అనుసంధానం

- చొరవ తీసుకుంటేనే నాగావళి- వంశధార కలిసేది
- కూటమిపైనే రైతుల ఆశలు

**వంశధార-నాగావళి నదులను అనుసంధానం చేసి జిల్లాను సస్యశ్యామలం చేయాలనే సంకల్పంతో ప్రారంభించిన ప్రాజెక్టుపై నీలినీడలు కమ్ముకుంటున్నాయి. 2017లోనే పనులు ప్రారంభమైనప్పటికీ వైకాపా హయాంలో నిధులు సక్రమంగా మంజూరు చేయలేదు. గత ప్రభుత్వ పాలనలో జలవనరుల శాఖ అధికారులు ప్రతిపాదనలు పంపినా పట్టనట్లు వ్యవహరించింది. ఇప్పటివరకు ఆరు సార్లు గడువు పెంచినా ప్రగతి లేకపోవడంతో అనుసంధాన పనులపై రైతుల్లో ఆశలు సన్నగిల్లుతున్నాయి.** – న్యూస్‌టుడేబూర్జ, ఆమదాలవలస గ్రామీణం, శ్రీకాకుళం అర్బన్

- పట్టిసీమ స్ఫూర్తితో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వంశధార-నాగావళి నదుల అనుసంధానానికి 2017లో రూ.89.90 కోట్లు మంజూరు చేసి పనులు ప్రారంభించారు. 2019లో సాధారణ ఎన్నికల నాటికి సుమారు 60 శాతం పూర్తి చేశారు. ఆ తరువాత వైకాపా ప్రభుత్వం ఐదేళ్లలో 20 శాతం మాత్రమే చేసింది. పనుల్లో తీవ్ర జాప్యం నెలకొనడంతో అంచనా విలువ రూ.145 కోట్లకు పెరిగింది.



బూర్జ మండలం గంగంపేట వద్ద పనికిరాని మొక్కలతో నిండిన అనుసంధాన కాలువ

- అనుసంధాన పనులు పూర్తయితే నారాయణపురం ఆనకట్ట కింద ఉన్న ఏడు మండలాల్లోని 102 గ్రామాల పరిధిలో 37,053 ఎకరాల ఆయకట్టును స్థిరీకరించవచ్చు. కొత్తగా మరో 5 వేల ఎకరాలకు సాగునీరు లభ్యమవుతుంది. ఓవీపేట పరిధిలో ఎత్తిపోతల పథకం నిర్మించి మరో 600 ఎకరాలకు సాగునీరు అందించవచ్చు.

### ఇదీ పరిస్థితి..

- బూర్జ మండలం లచ్చయ్యపేట వద్ద సుమారు 10 మంది రైతుల నుంచి ప్రభుత్వం భూములు తీసుకున్నప్పటికీ పరిహారం అందించడానికి చర్యలు తీసుకోలేదు.
- గంగంపేట నుంచి నారాయణపురం వరకు వయోడెక్టు నిర్మించాలని రైతులు, ప్రజలు వైకాపా ప్రభుత్వం ఏర్పడిన కొత్తలో అప్పటి సభాపతి తమ్మినేని సీతారాంను కోరారు. స్థలం అనువుగా లేదని లోతట్టు ప్రాంతంలోని గ్రామాలు ముంపునకు గురికాకుండా.. పంటలకు వరద నష్టం లేకుండా యూటీ నిర్మాణం దిశగా అడుగులు వేసినప్పటికీ ఆదిలోనే ఆయా పనులు నిలిచిపోయాయి. ఈ విషయమై సరైన నిర్ణయం తీసుకోకపోతే ఎగువన ఉన్న సుమారు 10 గ్రామాలు నీట మునిగే అవకాశం ఉందని ప్రజలు ఆవేదన చెందుతున్నారు.
- వంశధార-నాగావళి అనుసంధానం ప్రాజెక్టుకు సంబంధించి చేసిన పనుల వరకు బిల్లు ఇప్పించాలని కోరుతూ రెండు నెలల కిందట గుత్తేదారు ప్రభుత్వానికి లేఖ రాశారు. ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ దీనిపై సమీక్షించి పనులు పూర్తి చేయాలని ఆయనకు సూచించారు. ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి హెచ్‌ఎల్‌సీ పనుల పరిస్థితిని ఆరా తీయడంతో ఉన్నతాధికారులకు నివేదిక పంపారు.

### చేపట్టాల్సిన పనులు

ఇప్పటి వరకు 80 శాతం పనులు పూర్తయినా చాలా వరకు అసంపూర్తిగా ఉన్నాయి. 33.583 కి.మీ. మేర కాలువకు సుమారు 30 కి.మీ.మేర మట్టి పనులు పూర్తయినా దారి పొడవునా పనికిరాని మొక్కలు పెరిగి చిట్టడవిని తలపిస్తోంది. 3.583 కి.మీ పనులు వివిధ కారణాలతో ప్రారంభించలేదు. కాలువపై చేపట్టాల్సిన 66 నిర్మాణాలకు 34 పూర్తయ్యాయి. మరో 23 వివిధ దశల్లో ఉన్నాయి. 7 నిర్మాణాలను ప్రారంభించాలి. గేట్లు, హెడ్ రెగ్యులేటర్లు, క్రాస్ రెగ్యులేటర్లు, 10 డిస్ట్రిబ్యూటర్ల నిర్మాణాలు చేపట్టాల్సి ఉంది.



సింగన్నపాలెం సమీపంలో అసంపూర్తిగా కాలువ నిర్మాణం

### ఉన్నతాధికారులకు నివేదించాం..

నాగావళి వంశధార అనుసంధాన పనులను ప్రభుత్వం ప్రాధాన్య ప్రాజెక్టు జాబితాలో చేర్చింది. ఇటీవల పాత ధరకు పనులు చేయలేనని గుత్తేదారు లేఖ రాశారు. దీన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. వారి ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటాం. – కేవీఎస్ స్వర్ణకుమార్, ఎస్ఈ, వంశధార సర్కిల్ కార్యాలయం, శ్రీకాకుళం

### కూటమి ప్రభుత్వంపై ఆశలు పెట్టుకున్నాం..

వంశధార-నాగావళి నదుల పనులను కూటమి ప్రభుత్వం త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలి. కాలువలు అందుబాటులోకి వస్తే ఈ ప్రాంతంలో ఆయకట్టుకు సమృద్ధిగా సాగునీరు అందుతుంది. ఈ దిశగా ప్రజాప్రతినిధులు, అధికారులు దృష్టి సారించాలి. – పేడాడ అప్పాజీ శ్రీనివాస్, రైతు, లాభాం, బూర్జ మండలం

### పూర్తిగా విస్మరించారు..

వైకాపా హయాంలో అనుసంధాన పనులను పూర్తిగా విస్మరించారు. కాలువల నిర్మాణం చేపట్టేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రికి వినతిపత్రం అందజేశాం. నిధులు మంజూరైన వెంటనే పనులు ప్రారంభమవుతాయి. రైతుల పొలాలు, నారాయణపురం ఆనకట్టకు సాగునీరు సమృద్ధిగా అందేలా చర్యలు తీసుకుంటాం.
- కూన రవికుమార్, ఎమ్మెల్యే, ఆమదాలవలస

# ఫిషింగ్ హార్బర్ పనులు వేగవంతం చేయండి



హార్బర్ నిర్మాణ పనుల ప్రణాళికను పరిశీలిస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎమ్మెల్యే ఎన్ఈఆర్

**ఎచ్చెర్ల, న్యూస్‌టుడే:** ఎచ్చెర్ల మండలం బుడగట్లపాలెం వద్ద రూ.370 కోట్లతో నిర్మిస్తున్న ఫిషింగ్ హార్బర్ పనులు వేగవంతం చేయాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. బుడగట్లపాలెం సముద్రతీరంలో నిర్మిస్తున్న హార్బర్ పనుల పరిస్థితులను గురువారం స్థానిక ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావుతో కలిసి కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా హార్బర్ నిర్మాణ పనులు చేపడుతున్న విశ్వసముద్ర హోల్డింగ్ ప్రైవేటు లిమిటెడ్ సంస్థ ప్రతినిధులు, రెవెన్యూ, అటవీశాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. హార్బర్‌కు కేటాయించిన 40.84 ఎకరాల స్థలంలో అటవీశాఖకు సంబంధించిన రెండు ఎకరాలు మినహాయించి పనులు వేగవంతంగా జరగాలని ఆదేశించారు. ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు మాట్లాడుతూ హార్బర్ నిర్మాణం పూర్తయితే నియోజకవర్గంలోని మత్స్యకారులతోపాటు యువతకు ఉపాధి లభిస్తుందన్నారు. దీన్ని దృష్టిలోఉంచుకొని వీలైనంత వేగంగా పనులు పూర్తిచేయాలని సిబ్బంది ఆదేశించారు. ప్రభుత్వం నుంచి అన్ని రకాల సహాయ సహకారాలు అందేలా తన వంతు కృషిచేస్తానని చెప్పారు. కార్యక్రమంలో ఆర్డీవో కె.సాయిప్రత్యూష, జిల్లా మత్స్యశాఖ ఉప సంచాలకులు శ్రీనివాసరావు, తెదేపా పూర్వ జిల్లా అధ్యక్షుడు చౌదరి నారాయణమూర్తి, సర్పంచు అల్లుపల్లి రాంబాబు, కూటమి నేతలు తదితరులు పాల్గొన్నారు.

## యూజీసీ నిధుల విడుదలకు వినతి



కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడుకి వినతిపత్రం అందజేస్తున్న వర్సిటీ రిజిస్ట్రార్ పీలా సుజాత

**ఎచ్చెర్ల, న్యూస్‌టుడే:** డా.బి.ఆర్. అంబేడ్కర్ విశ్వవిద్యాలయానికి యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ నుంచి రావాల్సిన నిధుల విడుదలపై వర్సిటీ రిజిస్ట్రార్ పీలా సుజాత దిల్లీలో గురువారం కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు, యూజీసీ అధికారులను కలిసి వినతిపత్రం ఇచ్చారు. రిజిస్ట్రార్ మాట్లాడుతూ.. యూజీసీ నుంచి రూ.2.5 కోట్లు అందాల్సి ఉందని, దీనిపై సంబంధిత అధికారులను కలిసి సమస్యను తెలియజేశామన్నారు. వీలైనంత వేగంగా నిధులు విడుదల చేసి వర్సిటీ అభివృద్ధికి సహకారం అందించాలని కోరామన్నారు. కేంద్రమంత్రి కూడా సానుకూలంగా స్పందించి సంబంధిత అధికారులతో మాట్లాడి నిధుల విడుదలకు తగిన చర్యలు చేపడతామని చెప్పారన్నారు.

## తుపానును సమర్థంగా ఎదుర్కొంటాం



సంతబొమ్మాళిలో ఉపకేంద్రాన్ని పరిశీలిస్తున్న ఈపీడీసీఎల్ ఎస్ఈ కృష్ణమూర్తి, అధికారులు

**గుజరాతీపేట(శ్రీకాకుళం) న్యూస్‌టుడే:** జిల్లాలో దానా తుపానును సమర్థంగా ఎదుర్కోవడానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకున్నామని తూర్పు ప్రాంత విద్యుత్తు పంపిణీ సంస్థ (ఈపీడీసీఎల్) శ్రీకాకుళం సర్కిల్ ఎస్ఈ నాగిరెడ్డి కృష్ణమూర్తి తెలిపారు. తుపాను ప్రభావిత ప్రాంతాల్లో గురువారం ఆయన పర్యటించి అక్కడి పరిస్థితులను గమనించారు. సంతబొమ్మాళిలో విద్యుత్తు ఉపకేంద్రాన్ని పరిశీలించారు. మూలపేట పోర్టు నిర్మాణ ప్రాంతాన్ని సందర్శించారు. 700 స్తంభాలు, అనుబంధ సామగ్రి, విద్యుత్తు తీగలు, ట్రాన్స్‌ఫార్మర్లు అందుబాటులో ఉంచామని తెలిపారు. గాలులు, వర్షం కురుస్తున్న ప్రాంతాల్లో ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. 13 మండలాలకు నోడల్ అధికారులను నియమించామని.. ఈఈలు, డీఈలు, ఏఈలను అప్రమత్తం చేశామన్నారు.

# జిల్లా సర్వతోముఖాభివృద్ధికి కృషి



మదనగోపాలసాగరం ఎత్తిపోతల పథకాన్ని పునఃప్రారంభిస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు

**టెక్కలి, న్యూస్‌టుడే:** ప్రజలు ఇచ్చిన అవకాశాన్ని జిల్లా అభివృద్ధికి ప్రతి క్షణం వినియోగించేందుకు పరితపిస్తానని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. గురువారం టెక్కలిలో మదనగోపాల సాగరం ఎత్తిపోతల పథకాన్ని ఆయన పునఃప్రారంభించారు. అనంతరం జిల్లా ఆసుపత్రికి ఆనుకుని ఏర్పాటు చేసిన గోసంరక్షణ కేంద్రాన్ని ప్రారంభించారు. అక్కడి నుంచి రావివలసలో రూ.68 లక్షలతో నిర్మించనున్న బీటీ రహదారి పనులకు శంకుస్థాపన చేశారు. రావివలసలోని ఎండల మల్లికార్జునస్వామి ఆలయం వద్ద కార్తిక ఉత్సవ ఏర్పాట్లపై సమీక్షించారు. టెక్కలి నియోజకవర్గంలో 1,000 ఎకరాలతో ఎంఎస్ఎంఈ పారిశ్రామికవాడ ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. మరోవైపు మూలపేట పోర్టు త్వరితగతిన పూర్తిచేయడంతో పాటు కేంద్ర ప్రభుత్వ సహకారంతో ఏర్పాటయ్యే పారిశ్రామికవాడను అభివృద్ధి చేస్తామన్నారు. ఆఫ్‌షోర్ ప్రాజెక్టును సైతం పూర్తిచేస్తామన్నారు. 8,000 ఎకరాల భూమి అందుబాటులో ఉందని, మూలపేట ప్రాంతంలో కేంద్ర ప్రభుత్వం ఇచ్చే బీపీసీఎల్ రిఫైనరీ మంజూరైతే జిల్లా స్వరూపమే మారిపోతుందని తెలిపారు. నియోజకవర్గంలో ప్రతి ఇంటికి స్వచ్ఛమైన తాగునీరు, ప్రతి ఎకరాకు సాగునీరు అందిస్తామని చెప్పారు. ఉపాధి అవకాశాలు పెంచేందుకు అన్ని ప్రయత్నాలు చేస్తున్నామన్నారు. మదనగోపాలసాగరం ఎత్తిపోతల పథకం విస్తరణకు మరో రూ.3 కోట్లతో పనులు జరుపుతామన్నారు. నందిగాం మండలం కొండలప్రాంతానికి సాగునీటి సమస్య పరిష్కరించేందుకు ప్రయత్నిస్తామన్నారు. రావివలసలో కార్తీక మాస ఉత్సవాలకు వైభవంగా జరిపించేందుకు అధికారులకు పలు సూచనలు చేశారు. తేలినీలాపురం విదేశీ పక్షుల కేంద్రం అభివృద్ధికి రూ.1.90 కోట్లు మంజూరైందన్నారు. ఆర్డీవో కృష్ణమూర్తి, కింజరాపు హరివరప్రసాద్, ఎంపీపీ ఆట్ల సరోజనమ్మ, బగాది శేషగిరిరావు, తహసీల్దార్ దిలీప్ చక్రవర్తి, ఎల్ఎల్ నాయుడు, పినకాన అజయ్ కుమార్, కొళ్ల లవకుమార్, పోలాకి షణ్ముఖరావు, మట్ట సుందరమ్మ, దమయంతి, దల్లి రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

# అనుమతి గోరంత.. ఆక్రమణ కొండంత..!

గ్రానైటు క్వారీల్లో నిబంధనలు బేఖాతరు

**హరిపురం (మందస), న్యూస్‌టుడే**

సహజ వనరులను ఇష్టానుసారం కొల్లగొడుతున్నారు. నచ్చిన చోట యథేచ్ఛగా తవ్వేసి పచ్చని కొండలను పిండి చేస్తున్నారు. అనుమతులు తీసుకున్నది గోరంతైతే తవ్వకాలు మాత్రం కొండంతా అన్నట్లు దందా సాగుతోంది. అధికారులకు తెలిసినా పట్టనట్లు వ్యవహరిస్తుండటంతో ప్రభుత్వ ఖజానాకు భారీగా గండి పడుతోంది. మందస మండలంలోని పలు గ్రానైటు క్వారీల్లో అక్రమాల పర్వం సాగుతోంది. ఎక్కడా నిబంధనలు పాటిస్తున్న దాఖలాలు లేవు. అనుమతికి మించి కొండల్ని తొలిచేస్తున్నారు.



డాలకాయి సమీపంలో నల్లరాయి తవ్వకాలు

### భారీ వాహనాలతో ముప్పు

గ్రానైటు బండలను సానబెట్టడానికి ట్రాలీ లారీలపై తరలిస్తున్నారు. గ్రామీణ రహదారులపై 20 టన్నులకు మించి బరువుతో వాహనాలు నడపకూడదు. ఈ ప్రాంతంలో క్వారీల నుంచి 50 టన్నులకు మించి బరువుతో తరలిస్తుండటంతో రహదారులు ధ్వంసమవుతున్నాయి. కల్వర్టులు దెబ్బతింటున్నాయి. గ్రామాల్లో కొందరు అడ్డుపడిన వారికి తాయిలాలు ఎరచూపి పని సాగిస్తున్నారు.

- కొండలోగాం సమీపంలో కొండకు కొంత భాగంలో క్వారీ నిర్వహించడానికి అనుమతులున్నాయి. ఇక్కడ మొత్తం ప్రాంతంలో తవ్వకాలు జరుగుతున్నాయి.
- టంగరపుట్టి, గంగ్రుగాం, మహేంద్రపురం, బొగాబంద వద్ద రెవెన్యూ భూముల్లో అనుమతికి మించి గ్రానైటు తవ్వేస్తున్నారు.
- డాలకాయి సమీపంలో నిబంధనలకు విరుద్ధంగా బాంబులతో బండ రాళ్లను పేల్చి కొండను కొల్లగొడుతున్నారు. ఇక్కడి నుంచి పలాస మండలం తర్లాకోట, లొద్దభద్ర వద్ద స్టోన్ క్రషర్లకు తరలిస్తున్నారు. క్వారీలో పని చేస్తున్న కార్మికులకు కనీస వసతులు లేవు. గాయాలు తగలకుండా తల, కాళ్లు, చేతులకు తొడుగులు లేవు. శ్వాస తీసుకునేటప్పుడు శరీరంలోకి ధూళి వెళ్లకుండా మాస్కులు ధరించాలి. అవి లేకుండానే పనులు చేస్తున్నారు. కొందరు బాలురు కార్మికులుగా పని చేస్తున్నారని సమాచారం. అధికారుల పర్యవేక్షణ కొరవడటంతో నిర్వాహకులు ఇష్టానుసారం వ్యవహరిస్తున్నారు.



రాళ్లను యంత్రం సాయంతో ముక్కలు చేస్తున్న కార్మికుడు

### క్షేత్రస్థాయిలో పరిశీలిస్తాం..

అనుమతించిన మేరకే గ్రానైటు క్వారీల్లో తవ్వకాలు జరపాలి. అంతకు మించి చేపడితే అది అక్రమమే. మందస మండలంలోని అన్ని గ్రానైటు క్వారీలను సందర్శిస్తాం. అనుమతికి మించి తవ్వకాలు జరిగినట్లు తేలితే కఠిన చర్యలు తీసుకుంటాం.

**- విజయలక్ష్మి, గనుల శాఖ ఏడీ, టెక్కలి, హైమావతి, తహసీల్దారు, మందస**

## జిల్లా రెవెన్యూ అధికారిగా వెంకటేశ్వరరావు

**కలెక్టరేట్(శ్రీకాకుళం), న్యూస్‌టుడే:** జిల్లా రెవెన్యూ అధికారిగా ఎం.వెంకటేశ్వరరావును నియమిస్తూ గురువారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కొన్ని నెలలుగా డీఆర్వో పోస్టు ఖాళీగా ఉన్న విషయం విదితమే. వెంకటేశ్వరరావు గతంలో టెక్కలి ఆర్డీవోగా పని చేశారు.

## రైల్వే హెల్ప్ డెస్క్ ఏర్పాటు

**ఆమదాలవలస పట్టణం, న్యూస్‌టుడే:** శ్రీకాకుళం రోడ్డు ఆమదాలవలస రైల్వేస్టేషన్‌లో హెల్ప్ డెస్క్‌ను రైల్వే అధికారులు ఏర్పాటు చేశారు. 'దానా' తుపాను నేపథ్యంలో పలు రైళ్లు రద్దు చేసినట్లు రైల్వే అధికారులు తెలిపారు. ఈ నెల 24, 25, 26వ తేదీల్లో భువనేశ్వర్ వైపు ప్రయాణించే రైళ్లు, విజయవాడవైపు వెళ్లే 51 రైళ్లను రద్దు చేసినట్లు పేర్కొన్నారు. రైల్వే ప్రయాణికులకు ఎలాంటి సమాచారం కావాలన్నా హెల్ప్ డెస్క్‌ను సంప్రదించాలని కోరారు. టోల్ ఫ్రీ నంబర్లు 08942-286213, 85912, 85913, 85914 సంప్రదించాలని వివరించారు.

## 8న సర్వజనాసుపత్రిలో వినికిడి పరికరాల నమోదుకు శిబిరం

**గుజరాతీపేట(శ్రీకాకుళం), న్యూస్‌టుడే:** శ్రీకాకుళం నగరంలోని ప్రభుత్వ సర్వజనాసుపత్రిలో వచ్చే నెల ఎనిమిదో తేదీన వినికిడి పరికరాల కోసం వివరాలు నమోదు చేసుకోవడానికి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు డీఎంహెచ్‌వో డాక్టర్ బొడ్డేపల్లి మీనాక్షి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. దీన్‌దయాళ్ శ్రవణ ఫౌండేషన్ (విజయవాడ), జాతీయ ఆరోగ్య మిషన్, ఆర్‌బీఎస్కే, సంయుక్త ఆధ్వర్యంలో కార్యక్రమం జరుగుతుందని పేర్కొన్నారు. 21 ఏళ్ల లోపు వారే అర్హులని స్పష్టం చేశారు. ఓపీ నంబరు 27లో నిర్వహించనున్న శిబిరానికి వచ్చే వారు ఆధార్, రేషన్ కార్డులు, రెండు పాస్‌పోర్టు ఫొటోలు, ప్రభుత్వం జారీ చేసిన ప్యూర్ టోన్ ఆడియోమెట్రీ, సదరం ధ్రువపత్రం, ఈఎన్‌టీ వైద్యుడు రాసిన మందుల చీటీ తీసుకురావాలని సూచించారు.

## బీఆర్ఏయూకు రెడ్‌క్రాస్ ప్రశంస

**ఎచ్చెర్ల, న్యూస్‌టుడే:** సేవా కార్యక్రమాల్లో చురుకుగా భాగస్వామ్యం అవుతున్నందుకు డా.బి.ఆర్. అంబేడ్కర్ విశ్వవిద్యాలయాన్ని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ అభినందించింది. ఈ మేరకు రెడ్‌క్రాస్ ప్రతినిధులు ప్రత్యేక ప్రశంసా జ్ఞాపికను వర్సిటీ ఉపకులపతి ఆచార్య కె.ఆర్.రజనికి గురువారం ఆమె ఛాంబర్‌లో అందజేశారు. రక్తదాన శిబిరాలు నిర్వహణ, విపత్తుల సమయాల్లో భాగస్వామ్యం, పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాలు చేపట్టడం తదితర కార్యక్రమాలతో చేస్తున్న సేవలకు గుర్తింపుగా వర్సిటీకి ఈ గుర్తింపు లభించిందని వీసీ తెలిపారు. కార్యక్రమంలో వర్సిటీ ఇంజినీరింగ్ కళాశాల ప్రధానాచార్యులు సి.హెచ్.రాజశేఖరరావు, రెడ్‌క్రాస్ మేనేజర్ పెంకి చైతన్య, సమన్వయకర్త రమణ తదితరులు పాల్గొన్నారు.



## జూద శిబిరాలపై దాడి

### 10 మంది అరెస్టు

**పొందూరు, న్యూస్‌టుడే:** పొందూరు మండలం సింగూరు సమీపంలో బుధవారం అర్ధరాత్రి దాటాక పోలీసులు జూద శిబిరాలపై దాడులు నిర్వహించి పది మంది జూదరులను అదుపులోకి తీసుకున్నారు. నాగావళి సమీపంలో జూదం ఆడుతున్నట్లు సమాచారం రావడంతో ఎస్.ఐ. వి.సత్యనారాయణ సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. జూదరులను అరెస్టు చేసి వారి నుంచి రూ.1,50,520, 9 చరవాణులను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసినట్లు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

## జమిలి ఎన్నికల విధానంతో ప్రజాస్వామ్య స్ఫూర్తికి విఘాతం



బాపూజీ కళా మందిరంలో మాట్లాడుతున్న వీజీకే మూర్తి

**శ్రీకాకుళం సాంస్కృతికం, న్యూస్‌టుడే:** జమిలి ఎన్నికల విధానం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విఘాతం కలిగిస్తుందని.. ఈ నిర్ణయాన్ని కేంద్ర ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. శ్రీకాకుళం నగరంలోని బాపూజీ కళా మందిరంలో గురువారం గరిమెళ్ల విజ్ఞాన కేంద్రం అధ్యక్షుడు వీజీకే మూర్తి అధ్యక్షతన ప్రజాస్వామ్య భారతం-జమిలి ఎన్నికలు అనే అంశంపై సదస్సు నిర్వహించారు. మాజీ ఎమ్మెల్సీ ఎంవీఎస్ శర్మ, ప్రసిద్ధ రచయిత అట్టాడ అప్పలనాయుడు మాట్లాడుతూ జమిలి ఎన్నికలతో ఖర్చు తగ్గించవచ్చని, పరిపాలనపై దృష్టి సారించవచ్చని కేంద్ర ప్రభుత్వం మాయమాటలు చెబుతోందని విమర్శించారు. మతతత్వ కార్పొరేట్ విధానాన్ని నిరాటంకంగా కొనసాగించడానికే నూతన విధానాన్ని తెరపైకి తెచ్చారని పేర్కొన్నారు. రాష్ట్ర దళిత ఐకాస అధ్యక్షుడు కల్లేపల్లి రామ్‌గోపాల్, జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కిలారి ఈశ్వరరావు, ఐఎంఏ జిల్లా అధ్యక్షుడు సనపల నరసింహమూర్తి, యూటీఎఫ్ రాష్ట్ర కమిటీ సభ్యుడు రవీంద్ర, ముస్లిం ఐకాస కన్వీనర్ మహీబుల్లాఖాన్, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు, ఐద్వా జిల్లా కన్వీనర్ ఎ.లక్ష్మి, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి హరీష్ ప్రసంగించారు.

## 29న ప్రభుత్వ ఉద్యోగులకు క్రీడా పోటీలు

**శ్రీకాకుళం అర్బన్, న్యూస్‌టుడే:** శ్రీకాకుళం నగరంలోని కోడిరామ్మూర్తి క్రీడా మైదానంలో ఈ నెల 29న జిల్లా స్థాయి సివిల్ సర్వీసెస్ ఆటల పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ శాఖల్లో పని చేస్తున్న ఉద్యోగులు మాత్రమే అర్హులని స్పష్టం చేశారు. అథ్లెటిక్స్, షటిల్ బ్యాడ్మింటన్, చెస్, హాకీ, టెన్నిస్, క్రికెట్, కబడ్డీ, రెజ్లింగ్, క్యారమ్స్, బాస్కెట్ బాల్, ఖోఖో, వెయిట్‌లిఫ్టింగ్, ఈత, వాలీబాల్, యోగ అంశాల్లో పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పోటీలకు హాజరయ్యే వారు ఆధార్, ఉద్యోగ గుర్తింపు కార్డులతో కోడిరామ్మూర్తి క్రీడా ప్రాంగణానికి ఉదయం 9 గంటలకు హాజరు కావాలని సూచించారు. విజేతలు రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. మరిన్ని వివరాలకు 94409 63128 నంబరుకు ఫోన్ చేయాలని కోరారు.

## పంటల బీమా పథకాన్ని వినియోగించుకోవాలి



దూరదృశ్య సమీక్షకు హాజరైన కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్

**కలెక్టరేట్ (శ్రీకాకుళం), న్యూస్‌టుడే:** రబీకి సంబంధించి పంటల బీమా పథకాన్ని రైతులు వినియోగించుకోవాలని వ్యవసాయ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బి.రాజశేఖర్ సూచించారు. కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, వ్యవసాయ శాఖ అధికారులతో గురువారం దూరదృశ్య సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పంటల బీమాకు సంబంధించి ఇతరుల ప్రమేయం లేకుండా రైతులే నేరుగా నేషనల్ క్రాప్ ఇన్సూరెన్స్ పోర్టల్ ద్వారా ప్రీమియం చెల్లించే వెసులుబాటును ప్రభుత్వం కల్పించిందని తెలిపారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో జీడిమామిడి విస్తీర్ణం ఎక్కువగా ఉందని.. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోవాలని వ్యవసాయాధికారులకు ఆదేశించారు. గ్రామ వ్యవసాయ, ఉద్యాన సహాయకులకు తగిన శిక్షణ ఇవ్వాలని స్పష్టం చేశారు. జిల్లా వ్యవసాయాధికారి త్రినాథస్వామి, సీపీవో లక్ష్మీప్రసన్న, డీసీసీబీ సీఈవో వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

### ఆర్థికాభివృద్ధి ప్రణాళిక అమలు చేయండి

స్వర్ణాంధ్రప్రదేశ్-2047 లక్ష్యాలకు అనుగుణంగా రూపొందించిన జిల్లా ఆర్థికాభివృద్ధి ప్రణాళికను అమలు చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ఆదేశించారు. ప్రణాళిక లక్ష్య సాధనకు పకడ్బందీ కార్యాచరణ సిద్ధం చేయాలన్నారు. అమరావతిలోని ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయం నుంచి దూరదృశ్య సమీక్ష నిర్వహించారు.





మాట్లాడుతున్న యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కిశోర్‌కుమార్

## ఉపాధ్యాయులు, అధ్యాపకులు ఓటర్లుగా చేరాలి

**కలెక్టరేట్(శ్రీకాకుళం), న్యూస్‌టుడే:** ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నిక నేపథ్యంలో వచ్చే నెల ఆరో తేదీ లోపు అర్హులైన ఉపాధ్యాయులు, అధ్యాపకులు ఓటర్లుగా నమోదు కావాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.కిశోర్‌కుమార్, జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి గొంటి గిరిధర్ కోరారు. ఫారం-19 ద్వారా ఆన్‌లైన్‌లో, తహసీల్దారు కార్యాలయంలో వివరాలు నమోదు చేయించుకోవాలని సూచించారు. యూటీఎఫ్ కార్యాలయంలో గురువారం ప్రాంతీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఫారం-19కు సంబంధించి 2018 నవంబరు నుంచి 2024 నవంబరు ఒకటో తేదీ నాటికి ఆరేళ్ల కాలంలో మూడేళ్ల సర్వీసును ఉన్నత పాఠశాల, కళాశాలల్లో కలిగిన వారు అర్హులన్నారు. యూటీఎఫ్ నాయకులు హెచ్.అన్నాజీరావు, రవికుమార్, సురేష్, ఉమాశంకర్ తదితరులు పాల్గొన్నారు.

### చికెన్ ధరలు

| రకం | (బ్యాగ్)లైవ్ | డ్రెస్డ్ | స్కిన్‌లెస్ |
|---|---|---|---|
| బ్రాయిలర్ | 150 | 255 | 275 |




## నౌపడ ఉప్పు పరిశ్రమను నిర్వీర్యం చేయడం తగదు

**సంతబొమ్మాళి, న్యూస్‌టుడే:** నౌపడ ఉప్పు పరిశ్రమకు మంచి పేరు ఉందని, అటువంటి పరిశ్రమను నిర్వీర్యం చేయడం ప్రభుత్వాలకు తగదని పౌర హక్కుల సంఘం జిల్లా అధ్యక్షుడు పత్తిరి దానేష్ పేర్కొన్నారు. మండలంలోని మర్రిపాడు, శలగపేట, నౌపడ గ్రామాల్లో జిల్లా పౌర హక్కుల సంఘం ప్రతినిధులు గురువారం పర్యటించారు. ఈ ఉప్పు పరిశ్రమను వేలాది మంది కార్మికులు ఉపాధిగా చేసుకుని జీవిస్తున్నారని, కార్పొరేట్ పెట్టుబడిదారులకు ఈ భూములు కట్టబెట్టడం సరికాదని తెలిపారు. సన్నకారు ఉప్పు రైతులకు కేంద్రం లీజు హక్కులు పునరుద్ధరించాలని, ఉప్పు రైతులకు గుర్తింపు కార్డులు అందజేయలని, గోదాములు, కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడంతో పాటు ఉప్పు అనుబంధ పరిశ్రమలు నెలకొల్పి ఉపాధి అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. జిల్లా పౌరహక్కుల సంఘం ప్రతినిధులు సోమనాథం, జోగారావు, ఢిల్లీరావు, వైకుంఠరావు, లక్ష్మణ, తదితరులు పాల్గొన్నారు.

## ప్రియుడిపై యాసిడ్ దాడి

**బూర్జ, న్యూస్‌టుడే:** ప్రియుడిపై ప్రియురాలు యాసిడ్ పోసిన ఉదంతమిది. బూర్జ ఎస్సై ప్రవళ్లిక తెలిపిన వివరాల మేరకు.. గుంటూరు నగరంలోని బ్రాడీపేటకు చెందిన కె.ప్రసాద్ విజయనగరం జిల్లా డెంకాడలో లారీ చోదకుడిగా పని చేస్తున్నాడు. తొమ్మిది నెలల కిందట బూర్జ మండలం ఓవీ పేటకు చెందిన ఓ యువతితో పరిచయం ఏర్పడింది. కొంతకాలంగా వారిద్దరూ ఆమదాలవలసలోని పూజారిపేటలో కలిసి ఉంటున్నారు. ఈక్రమంలో వారి మధ్య మనస్పర్థలు రావడంతో ఇటీవల ఆమె స్వగ్రామానికి, అతను డెంకాడకు వెళ్లిపోయారు. ఈ నెల 23న ప్రసాద్‌ను ఆమదాలవలస రమ్మని యువతి కోరగా అతను అక్కడికి వెళ్లాడు. సాయంత్రమైనా ఆమె రాకపోయేసరికి నేరుగా ఓవీపేటలోని ఆమె ఇంటికి వెళ్లాడు. మరోసారి ఇద్దరి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. అతని ముఖంపై యాసిడ్ పోయగా తీవ్ర గాయాలయ్యాయి. ఈమేరకు బాధితుడు గురువారం పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు.

## పాము కాటుకు గురై వివాహిత మృతి



జయలక్ష్మి (పాత చిత్రం)

**నందిగాం, న్యూస్‌టుడే:** మండలంలోని శివరాంపురం పంచాయతీ కోటిపల్లి గ్రామానికి చెందిన ఓ వివాహిత పాము కాటుకు గురై మృతి చెందింది. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కోనారి జయలక్ష్మి (24) ఈ నెల 21న తన ఇంట్లో నిద్రపోతోంది. రాత్రి 11 గంటల సమయంలో కట్లపాము కరవడంతో బంధువులు టెక్కలి జిల్లా ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం శ్రీకాకుళం సర్వజన ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతి చెందింది. ఈమెకు భర్త సోమేశ్వరరావు, పిల్లలు కార్తీక్ (5), హర్షకుమార్ (3) ఉన్నారు. భర్త ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఏఎస్సై వరలక్ష్మి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.


## వివాహిత ఆత్మహత్య

**నందిగాం, న్యూస్‌టుడే:** మండలంలోని నౌగాం గ్రామానికి చెందిన ఓ వివాహిత గడ్డి మందు తాగి మృతి చెందినట్లు ఎస్సై షేక్ మహమ్మద్ ఆలీ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కొన్ని సావిత్రి (35) ఇటీవల గర్భసంచి చికిత్స చేయించుకుంది. అప్పటి నుంచి తరచూ వంట్లో బాగుండటం లేదని మానసికంగా బాధపడుతుండేది. గురువారం గడ్డి మందు తాగి ఇంట్లో పడిపోగా కుటుంబ సభ్యులు టెక్కలి జిల్లా ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యలో మృతి చెందింది. ఈమెకు భర్త తవుడు, కుమారుడు గిరి (14) ఉన్నారు. సావిత్రి సోదరుడు దాసరి ముఖలింగం ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### పురుగు మందు తాగి యువకుడు..

**ఎచ్చెర్ల(రణస్థలం), న్యూస్‌టుడే:** పొందూరు మండలం కోష్ట పంచాయతీ బండిపాలెం గ్రామానికి చెందిన అమర అయ్యప్ప (34) పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు జె.ఆర్.పురం ఎస్సై చిరంజీవి తెలిపారు. ఆయన చెప్పిన వివరాల మేరకు.. అయ్యప్ప కొంతకాలంగా ఆర్థిక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారు. ఈ క్రమంలో అప్పులు చేశాడు. అవి తీర్చలేక మనస్తాపానికి గురై ఈ నెల 21న ఇంట్లో పురుగు మందు తాగాడు. కుటుంబ సభ్యులు గమనించి ఆయన్ను చికిత్స నిమిత్తం శ్రీకాకుళం సర్వజన ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ యువకుడు గురువారం మృతి చెందాడు. అతడికి భార్య దివ్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## వృద్ధుడి బలవన్మరణం



అప్పారావు (పాత చిత్రం)

**ఎత్తురాళ్లపాడు(కోటబొమ్మాళి) న్యూస్‌టుడే:** చిట్టివలస పంచాయతీ భగీరథపురం గ్రామానికి చెందిన ఓ వృద్ధుడు గడ్డి మందు తాగి బలవన్మరణానికి పాల్పడ్డాడు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మెట్ట అప్పారావు(64) కొన్నాళ్లుగా గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్నాడు. ఇటీవల ఆయనకు శస్త్ర చికిత్స సైతం నిర్వహించారు. అప్పటి నుంచి మానసికంగా ఇబ్బంది పడుతున్నాడు. ఈ నేపథ్యంలో బుధవారం ఇంటి వద్ద గడ్డి మందు తాగాడు. వెంటనే కుటుంబ సభ్యులు శ్రీకాకుళం సర్వజన ఆసుపత్రికి తరలించగా అక్కడే చికిత్స పొందుతూ గురువారం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. కోటబొమ్మాళి ఎస్సై-2 రెల్లయ్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# పలాస

• పలాస • ఇచ్ఛాపురం

## భక్తిశ్రద్ధలతో కుంకుమ పూజలు

ఇచ్ఛాపురం, న్యూస్‌టుడే: ఉత్కళ సంస్కృతిని అనుసరించి రత్తకన్న నాయుడువీధి, ఇచ్ఛాపురం పట్టణం పొందరవీధుల్లో గత 8 రోజులుగా గజలక్ష్మిదేవికి పూజలను నిర్వహిస్తున్నారు. గురువారం ఈ వేడుకల్లో భక్తులు పాల్గొన్నారు. అనంతరం మహిళలు యాత్రగా కలశాల నిమజ్జనానికి వెళ్లారు. స్థానిక కళాకారులు శాస్త్రీయ నృత్యాలు అలరించాయి.



కలశాల నిమజ్జనానికి వెళ్తున్న మహిళలు

## విద్యార్థులకు రక్త పరీక్షలు

పలాస పట్టణం: పలాస ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు రక్త పరీక్షలను గురువారం నిర్వహించారు. కళాశాల రెడ్‌రిబ్బన్‌క్లబ్, ఎన్ఎస్ఎస్, జంతుశాస్త్ర విభాగాల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఇందులో ప్రిన్సిపల్ డాక్టర్ జె.వెంకటలక్ష్మి, వైస్ ప్రిన్సిపల్ ఎల్.గణపతిరావు డాక్టర్ పి.మధు, ఎంహెచ్‌కే ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థుల నుంచి రక్త నమూనాలు సేకరిస్తున్న వైద్య సిబ్బంది

**మేమున్నాం.. మీకు తోడుగా**
(10 AM TO 1 PM)

ఇచ్ఛాపురం : 9440437129
పలాస : 8008574279
కవిటి గ్రామీణం : 8309638875
పలాస గ్రామీణం: 7386408926
కంచిలి గ్రామీణం: 9704568738

**సమస్య :** సంతపేట వద్ద ఆక్రమణలు పెరిగిపోతున్నాయి.
- బి.రవి, ఇచ్ఛాపురం

**సమాధానం :** తొలగిస్తాం. - ఎన్.వెంకటరావు, తహసీల్దారు, ఇచ్ఛాపురం
- న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం

**సమస్య:** పలాస మండలం మామిడిపల్లిలో కాలువలపై పలకలు లేకపోవడంతో ఇబ్బంది పడుతున్నాం - **స్థానికులు**

**సమాధానం:** త్వరలోనే సమస్య పరిష్కరిస్తాం -**వైకుంఠరావు, మండల విస్తరణాధికారి, పలాస**
- న్యూస్‌టుడే, పలాస గ్రామీణం



ఇళ్ల సమీపంలో నిలిచిపోయిన నీటిలో పెరిగిన మొక్కలు

### రోజులతరబడి నిల్వ

కాపు వీధి వద్ద ఉన్న పెద్ద కాలువ పనికిరాని మొక్కలు పెరిగి మురుగు వెళ్లే అవకాశం లేకుండా పోయింది. మరోవైపు అన్నపూర్ణ ఆశ్రమ ప్రాంతంలో కాలువలు లేకపోవడంతో మురుగు, వరద నీరు ఖాళీ స్థలాల్లో నిలిచిపోతుంది. రోజుల తరబడి నిల్వ ఉండి ఆకుపచ్చ రంగులో నీరు మారిపోవడంతోపాటు దోమల వృద్ధి చెందుతున్నాయని, విషకీటకాలు కనిపిస్తున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## కష్టాలతో సహవాసం

న్యూస్‌టుడే, పలాస, కాశీబుగ్గ

**పలాస పట్టణంలో అన్నపూర్ణ ఆశ్రమ ప్రాంతంలో నివాసితులు మౌలిక వసతులు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సదుపాయాలు కల్పించాలని అధికారుల దృష్టికి పలుమార్లు తీసుకెళ్లినా.. స్పందించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.**

• రోడ్లు వేయరు.. కాలువలు నిర్మించరు
• మురుగు నిలిచి రోగాల బారిన పడుతున్న ప్రజలు

### పట్టించుకోని అధికారులు

అన్నపూర్ణ ఆశ్రమం ప్రాంతంలో కాపువీధి, కంచర వీధి, బత్తుల వీధుల సమీపంలో ఉండే బావుల నీటి ప్రజలు వినియోగిస్తారు. వర్షాలు పడేసమయంలో లేదా ఏడాదికి రెండు లేదా మూడు సార్లు క్లోరినేషన్ చేయాల్సి ఉన్నా చేయడం లేదు. రోగాల బారిన పడుతున్నామని స్థానికులు వాపోతున్నారు.

### చర్యలు తీసుకుంటాం

బావుల్లో క్లోరినేషన్ చేయిస్తాం. మురుగునీరు తొలగించే ఏర్పాట్లు చేస్తాం. – ఎన్.రామారావు, కమిషనర్, పలాస–కాశీబుగ్గ పురపాలక సంఘం



క్లోరినేషన్‌కు నోచుకోని బావి





### పోటీతత్వం అలవడాలి

విద్యార్థుల్లో పోటీతత్వం అలవడాలని పలాస మదర్‌థెరెసా విద్యాలయం కరస్పాండెంట్ గంగాభవాని అన్నారు. 'ఈనాడు' ఆధ్వర్యంలో 8, 9, 10 తరగతి విద్యార్థులకు ప్రతిభా పాటవ పోటీలు పలాసలో గురువారం నిర్వహించారు. 'అంతర్జాలం వినియోగం వల్ల లాభనష్టాలు, విద్యార్థులపై సామాజికమాధ్యమాల ప్రభావం' అంశంపైవ వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విజేతలుగా కె.భవ్యశ్రీ 10వ తరగతి(ప్రథమ), ఏ.తనుశ్రీ 9వ తరగతి (ద్వితీయ), వి.ఇందు 8వ తరగతి (తృతీయ) స్థానాలు గెలుచుకున్నారు. విద్యార్థులకు ప్రశంసాపత్రాలు, బహుమతులు కరస్పాండెంట్ గంగాభవాని అందజేశారు. - న్యూస్‌టుడే, పలాస

## ఆటో బోల్తా: 9 మందికి గాయాలు

కాశీబుగ్గ, న్యూస్‌టుడే: పలాస సమీప కంబిరిగాం జాతీయ రహదారిపై గురువారం ఆటో బోల్తా పడటంతో 9 మందికి గాయాలయ్యాయి. నారాయణపురానికి చెందిన కార్మికులు జీడి కర్మాగారంలో పనిచేసేందుకు ఆటోలో పలాస వస్తుండగా ఈ ఘటన జరిగింది. మహిళలతోపాటు చోదకుడు నాగేశ్వరరావు గాయాలయ్యాయి. వీరిని ప్రభుత్వాసుపత్రిలో చేర్పించారు. పార్వతికి తీవ్ర గాయాలు అవడంతో జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించారు. కాశీబుగ్గ పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.



క్షతగాత్రులను అంబులెన్స్‌లో తరలిస్తున్న ఆసుపత్రికి సిబ్బంది

## అన్నదాతల భూ సమస్యలు పరిష్కరిస్తాం

పలాస గ్రామీణం, న్యూస్‌టుడే: వైకాపా హయాంలో నిర్వహించిన భూముల రీ సర్వేలో జరిగిన తప్పులను సరి చేసేందుకు పలాస మండలం వీరభద్రాపురం గ్రామంలో తహసీల్దార్ కల్యాణ చక్రవర్తి ఆధ్వర్యంలో గురువారం గ్రామసభ నిర్వహించారు. వీరభద్రాపురం రైతుల నుంచి 18 వినతులు అధికారులకు అందాయి.

### సామాజిక భవనమే దిక్కు



కంచిలి మండలం చిన్నకొజ్జిరియా పాఠశాలకు సొంత భవనం లేకపోవడంతో గ్రామానికి చెందిన సామాజిక భవనాన్నే పాఠశాల కోసం వినియోగిస్తున్నారు. 1వ తరగతి నుంచి 5 వరకు మొత్తం 18 మంది విద్యార్థులు చదువుతున్నారు. దీంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి పాఠశాల భవనం నిర్మించాలని గ్రామస్థులు కోరుతున్నారు. ఈ విషయం మండల విద్యాధికారి చిట్టిబాబు వద్ద ప్రస్తావించగా త్వరలోనే సమస్య పరిష్కరిస్తామన్నారు. -న్యూస్‌టుడే, కంచిలి గ్రామీణం

### గుంతలు... తప్పని అగచాట్లు

సీమూరు నుంచి నెలవంక మీదుగా కవిటి వెళ్లే ఆర్ అండ్‌బీ రహదారి పలు చోట్ల గుంతలు ఏర్పడడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా.. స్పందన లేదని స్థానికులు తెలిపారు. ప్రమాదాలు జరుగుతున్నాయని ఇప్పటికైనా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఆర్అండ్‌బీ ఏఈ మోహనరావుని వివరణ కోరగా నిధుల వచ్చిన వెంటనే మరమ్మతులు చేస్తామని తెలిపారు. – న్యూస్‌టుడే, కవిటి గ్రామీణం



### పశువుల్ని రోడ్లపైకి వదిలితే చర్యలు

స్పందనకు వందనం



మాట్లాడుతున్న కమిషనర్ రామారావు

పలాస, న్యూస్‌టుడే: పశువుల్ని ఇష్టారీతిన రోడ్లపైకి విడిచిపెడితే చర్యలు తీసుకుంటామని పురపాలక సంఘం కమిషనర్ ఎన్.రామారావు అన్నారు. 'వాటిదే రాజ్యం' పేరిట ఈ నెల 22న ఈనాడులో కథనం ప్రచురించటంతో గురువారం సాయంత్రం జంటపట్టణాలకు చెందిన పశువుల యజమానులతో సమావేశం ఏర్పాటు చేశారు. రెండు రోజుల తర్వాత పశువులు రోడ్లపై కనబడితే గోశాలకు పంపించడంతోపాటు సంబంధిత యజమానులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

### మొక్కలు తొలగించారు

ఇచ్ఛాపురం పట్టణంలో పలు వార్డులలో ఎంపీ నిధులతో నిర్మించిన సామాజిక భవనాలు పలు చోట్ల వినియోగానికి దూరంగా ఉన్నాయి. అలా సంతపేట వద్ద ఉన్న భవనం నిర్లక్ష్యానికి గురై, పూర్తిగా మొక్కలతో మూసుకుపోయింది. ఆ ప్రాంతంలో ఈ భవనం వినియోగం అవసరం ఉన్నా, పురపాలకులు పట్టలేదు. ఈ విషయమై 'ఈనాడు'లో గత బుధవారం 'మొక్కల వెనక ఉంది భవనం' శీర్షిక కథనం రావడంతో కమిషనర్ నల్లి రమేష్ స్పందించారు. మొక్కలను పూర్తిగా తొలగించారు. – న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం



### స్వామీ.. ఇంత అధ్వానమా..!



సోంపేట కాశీవిశ్వేశ్వర ఆలయం చెరువు అధ్వానంగా మారడంతో భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పుణ్య దినాల్లో మహిళలు ఈ చెరువులో స్నానాలు చేసి స్వామిని దర్శించడం ఆనవాయితీ. ముఖ్యంగా కార్తీకంలో నెలరోజుల పాటు ప్రత్యేక పూజలు చేసేందుకు ఈ చెరువుని వినియోగిస్తుంటారు. స్థానిక వ్యాపారులు వివిధ వ్యర్థాలను చెరువులో వేయడంతో అధ్వానంగా తయారైంది. వ్యర్థాలు తొలగించి భక్తులకు ఇబ్బందులు ఏర్పడకుండా చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. పంచాయతీ ఈవో ఎం. శాంతికుమారి వివరణ కోరగా మెరుగు పరిచేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. – న్యూస్‌టుడే, సోంపేట

## రసాభాసగా మండల సమావేశం

వజ్రపుకొత్తూరు, న్యూస్‌టుడే: మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో ఆధ్వర్యంలో జరిగిన ఎంపీపీ సర్వసభ్య సమావేశం గందరగోళంగా మారింది. పల్లె పండగ కార్యక్రమంలో ప్రారంభించిన అభివృద్ధి పనులకు ఆహ్వానించకపోగా, శిలాఫలకాలపై తమ పేర్లు వేయడం లేదని ఎంపీపీ భర్త, ప్రత్యేక ఆహ్వానితుడు ఉప్పరపల్లి ఉదయకుమార్ వ్యాఖ్యానించటంతో వాగ్వాదం చోటు చేసుకుంది. చినవంక పంచాయతీ సర్పంచి దువ్వాడ విజయలక్ష్మీ భర్త, మాజీ పీఏసీఎస్ అధ్యక్షుడు దువ్వాడ హేమబాబు చౌదరి, రెయ్యాపాడు తెదేపా ఎంపీటీసీ సభ్యుడు సూళ్ల చిట్టిబాబు ఈ వ్యాఖ్యలను తిప్పికొట్టారు. వైకాపా పాలనలో ఇలాంటి కార్యక్రమాలు జరిగిప్పుడు సర్పంచికి ఎప్పుడైనా సమాచారం ఇచ్చారా అని ప్రశ్నించారు. దీనిపై ఎంపీపీ ఉప్పరపల్లి నీలవేణి, మరికొందరు వైకాపా సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేయడంతో గందరగోళం నెలకొంది. ఎంపీడీవో రమేష్‌నాయుడు సర్దిచెప్పడంతో సద్దుమణిగింది. ● తొలుత కిడిసింగి నుంచి అక్కుపల్లి మధ్య 24 గంటల విద్యుత్తు సరఫరాకు చర్యలు తీసుకోవాలని చినవంక సర్పంచి విజ్ఞప్తి చేశారు. ● అంగన్‌వాడీ భవన నిర్మాణాలు, తీర పంచాయతీల్లో విద్యుత్తు సమస్యలు సభ దృష్టికి తీసుకెళ్లారు. ● ఒంకులూరు శ్మశాన వాటిక నిర్మాణాన్ని పూర్తి చేయాలని ఎంపీటీసీ సభ్యురాలు సందరమ్మ కోరారు. ● పలాస మండల పరిధిలో పని చేస్తున్న వెంకటాపురం పీహెచ్‌సీ మండల పరిధిలోకి తీసుకొచ్చి ఆ ప్రాంత ప్రజలకు వైద్య సేవలు అందించాలని ప్రత్యేక ఆహ్వానితుడు కోరారు.



ప్రొటోకాల్‌పై వైకాపా, తెదేపా సభ్యుల మధ్య వాగ్వాదం

## హరిపురం.. అవస్థలమయం..

మండల కేంద్రం మందస తరువాత పెద్ద గ్రామం హరిపురం. వ్యాపార రీత్యా దినదినాభివృద్ధి చెందుతున్నప్పటికీ సామాజికపరమైన సమస్యలు ప్రజలను పీడిస్తున్నాయి. ఆరువేల జనాభా ఉన్న గ్రామంలో పారిశుద్ధ్యం పడకేయగా, తాగు నీరు, చెరువుల అపరిశుభ్రతపై ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

న్యూస్‌టుడే
హరిపురం (మందస)



శివాలయం ముందు పూడికతో నిండిన స్నానాల చెరువు

### స్నానం చేస్తే చర్మవ్యాధులు

గ్రామానికి అనుకుని ఉన్న శివాలయం ముందు, రుద్రభూమి పక్కన స్నానాల చెరువులు ఉన్నాయి. కార్తికమాసంలో మహిళలు సైతం ఈ తటాకాలను వినియోగిస్తారు. పూడికతో నీరు కలుషితమై చర్మవ్యాధులతో బాధపడుతున్నారు.

### కంపు.. కంపు

గ్రామ ప్రధాన రహదారి (పాత జాతీయ రహదారి) పక్కన నిత్యం జనంతో కిటకిటలాడే ప్రదేశంలో చేపలు, మాంసం దుకాణాలు ఉన్నాయి. దీంతో వ్యర్థాలు సమీపంలో పడేస్తుండటంతో దుర్వాసనతో ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు.

### శుభ్రం చేసి ఎన్ని రోజులో..

హెచ్‌బీకాలనీలోని రక్షిత మంచి నీటి పథకం ట్యాంకు శిథిలావస్థకు చేరింది. ఇక్కడ నుంచే తాగునీరు సరఫరా అవుతోంది. సంవత్సరాలుగా ట్యాంకు శుభ్రం చేయడం లేదు. శిథిలావస్థకు చేరడంతో పైకి ఎక్కేందుకు ఎవరూ సాహసించడం లేదు.. దీంతో ప్రజలు సీజనల్ వ్యాధుల బారిన పడుతున్నారు.

### కొత్త ట్యాంకు నుంచి సరఫరా

పాత ట్యాంకు బాగా పాతబడటంతో ట్యాంకును శుభ్రం చేయడం సాధ్యం కావడం లేదు. కొత్తగా నిర్మించిన సుజలధార ట్యాంకుతో పైపులైనును అనుసంధానించి తాగునీరు అందిస్తాం.
– ప్రసన్నకుమార్, ఆర్‌డబ్ల్యుఎస్ జేఈ, మందస

### పూడిక తీయిస్తాం

చెరువుల్లోని పూడిక తీయిస్తాం. చేపల బజారును మార్చడం విషయమై గ్రామ పెద్దలతో సమావేశమై నిర్ణయం తీసుకుంటాం.
– జె.పురుషోత్తం, సర్పంచి, హరిపురం.

### శివారుకు తరలించాలి

శివాలయం, రుద్రభూమి చెంతన ఉన్న చెరువుల్లోనే 80 శాతం ప్రజలు స్నానాలు చేస్తున్నారు. పూడిక తీయించి శుభ్రం చేయాలి. వ్యర్థాలు జనావాసాల మధ్య పడేస్తుండటంతో దుర్వాసన భరించలేకపోతున్నాం. ఆ దారిలో ఆసుపత్రి సిబ్బంది, రోగులు, పాఠశాల, కళాశాలల విద్యార్థులు ముక్కు మూసుకుని దాటి వెళ్తున్నారు. గ్రామ శివారుకు వీటిని తరలించాలి
– గొలుసు మురళి, యరుకోల సత్యనారాయణమూర్తి, హరిపురం



జనావాసాల మధ్య చేపల బజారు

## దానా తుపానుపై అప్రమత్తంగా ఉండండి

ఇచ్ఛాపురం, పలాస గ్రామీణం, న్యూస్‌టుడే: దానా తుపాను హెచ్చరికల నేపథ్యంలో ఇచ్ఛాపురం తహసీల్దారు కార్యాలయ ఆవరణలో పలాస ఆర్డీవో ఎం.కృష్ణమూర్తితో కలసి నియోజకవర్గస్థాయి అధికారులతో తుపానును ఎదుర్కొనేందుకు సమీక్ష చేశారు. పునరావాస కేంద్రాలలో ఆహారం, నీరు, పాలు, మందులు అందుబాటులో ఉంచాలన్నారు. సరఫరాలో ఇబ్బందులు తలెత్తితే విద్యుత్తుశాఖ ఉద్యోగులు వెంటనే సమస్య పరిష్కరించాలన్నారు. తాగునీటి ట్యాంకర్లను సిద్ధం చేయాలని ఎమ్మెల్యే సూచించారు.

● క్యాంపు కార్యాలయంలోనూ నాలుగు మండలాల తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఆర్అండ్‌బీ, ఇరిగేషన్, సచివాలయ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. అవసరమైతే తీరప్రాంతంలోని మత్స్యకారులను సురక్షిత ప్రాంతాలకు తరలించాలన్నారు. మూగజీవాలను సైతం రక్షించాలన్నారు. ● ఇచ్ఛాపురంలో 91141 15363 నెంబరుతో కంట్రోల్‌రూమ్ ఏర్పాటు చేసి 24 గంటలూ విధినిర్వహణలో ఉండేలా సిబ్బందికి బాధ్యతలను అప్పగించారు. ● మండల విస్తరణాధికారి మెట్ట వైకుంఠరావుతో కలిసి ఎంపీడీవో వసంత్‌కుమార్ గురువారం అమలకుడియాలో పర్యటించారు. గ్రామం సమీపం నుంచి వరహాల గెడ్డ ప్రవహిస్తుండడంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అశోక్



ఇచ్ఛాపురం గ్రామీణం: డొంకూరు తీరంలో 20 మీటర్లు ముందుకొచ్చిన సముద్రం

### నేడు పలు రైళ్లు రద్దు

ఇచ్ఛాపురం మీదుగా సాగే పలు రైళ్లను శుక్రవారం రద్దు చేసినట్లు జెడ్ఆర్‌యూసీసీ సభ్యుడు కె.సూర్యప్రకాశరావు తెలిపారు. రద్దయిన రైళ్లలో భువనేశ్వర్-విశాఖపట్నం (22819) ఇంటర్‌సిటీ, బ్రహ్మపుర-విశాఖపట్నం (08531) పాసింజర్ స్పెషల్, బ్రహ్మపుర-విశాఖపట్నం (18525) ఎక్స్‌ప్రెస్, గుణుపురం-కటక్ (08422) మెమూ, గుణుపురం-పూరీ (18418) ఎక్స్‌ప్రెస్, పూరీ-గుణుపురం(18417) ఎక్స్‌ప్రెస్‌లు ఉన్నాయని తెలిపారు.

### మత్స్యకారులకు అధికారుల హెచ్చరిక

వజ్రపుకొత్తూరు గ్రామీణం, న్యూస్‌టుడే: వజ్రపుకొత్తూరు మండలం మంచినీళ్లపేట, హుకుంపేట, పూడిలంక, వజ్రపుకొత్తూరు, డోకులపాడు, మెట్టూరు ప్రాంతాల్లో గురువారం తహసీల్దార్ సీతారామయ్య పర్యటించారు. అక్కడ మత్స్యకారులకు పలు సూచనలు చేశారు. వేటకు వెళ్లొద్దని కోరారు.



ఎంఎన్‌పేటలో మత్స్యకారులతో మాట్లాడుతున్న తహసీల్దారు సీతారామయ్య

## ఆధునిక పద్ధతులపై అవగాహన కల్పించండి

వజ్రపుకొత్తూరు గ్రామీణం, న్యూస్‌టుడే: వ్యవసాయంలో ఆధునిక పద్ధతులు ఆరుతడి పంటల్లో అవలంబించే పద్ధతులపై సంబంధిత శాఖ అధికారులు సూచనలు, సలహాలు ఇవ్వాలని పలాస వ్యవసాయ సహాయ సంచాలకులు మధు పేర్కొన్నారు. వజ్రపుకొత్తూరు మండలం అనంతగిరిలో గురువారం పలాస డివిజన్ నాలుగు మండలాల వ్యవసాయశాఖ సహాయకులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. వరి, అపరాలు, వేరుశెనగ, నువ్వులు, కట్టెజనుము, విత్తన శుద్ధి, కాలిబాటలు తీయడం, సమగ్ర సస్యరక్షణ, ఎరువుల యాజమాన్యం తదితర పద్ధతులపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఏడీఏ వెంకటేశ్వరరావు, ఏవో కిరణ్‌వాణి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వ్యవసాయాధికారి మధు

## అవీ.. ఇవీ.. అన్నీ

### పేద విద్యార్థులకు చేయూత

కవిటి, కవిటి గ్రామీణం, న్యూస్‌టుడే : కవిటి గ్రామానికి చెందిన పారిశుద్ధ్య కార్మికుడి కుమారుడు మది జానకిరావు గుంటూరు నాగార్జున విశ్వవిద్యాలయంలో ఇంజినీరింగ్ చదువుతున్నాడు. అతడికి శ్రీ చింతామణి అమ్మవారి ట్రస్ట్ హైదరాబాదు గురువారం రూ. 40 వేలు ఆర్థిక సాయం అందజేసింది. మరో నిరుపేద విద్యార్థిని హాసినికి రూ. 20 వేలు అందజేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు లక్ష్మణరావు, రమేష్, శేఖర్, మధు తదితరులు పాల్గొన్నారు. ● కవిటి మండలం నెలవంక గ్రామానికి చెందిన కమల ఇటీవల మృతి చెందింది. ఆమె భర్తకు మతిస్థిమితం లేకపోవడంతో చిన్న పాప దిక్కుతోచని స్థితిలో ఉంది. ఎస్‌జీఎఫ్ సభ్యులు విషయం తెలుసుకుని గురువారం రూ. 10 వేలు ఆర్థిక సాయం అందించాం



### కీర్తిరాయి చెరువును సుందరీకరించండి

కాశీబుగ్గ, న్యూస్‌టుడే:. కాశీబుగ్గలోని కీర్తిరాయి చెరువును పర్యటకంగా అభివృద్ధి చేయాలని జనసేన పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త దుర్గారావు పేర్కొన్నారు. కీర్తిరాయి చెరువు పరిసరాలను గురువారం పరిశీలించారు. చెత్తతో నిండి చెరువు దుర్గంధభరితంగా తయారైందని పూడిక తీసి అభివృద్ధి చేయాలన్నారు.

### దస్త్రాల పరిశీలన

కంచిలి గ్రామీణం, న్యూస్‌టుడే: కంచిలి మండల పరిధి జాడుపూడి గ్రామంలో వెలుగు ఏపీఎం గురువారం ఉదయం పర్యటించారు. స్వయం శక్తి మహిళా సంఘాల సంఘ సమావేశాలు, పొదుపు, అప్పులు, చెల్లింపులు, దస్త్రాల నిర్వహణ తదితర అంశాలను పరిశీలించారు.

### హుద్‌హుద్ ఇళ్లు పంపిణీ చేయాలి

పలాస, న్యూస్‌టుడే: పుర పరిధిలో నిర్మించిన హుద్‌హుద్ ఇళ్లు పారదర్శకంగా పంపిణీ చేయాలని జనసైనికులు విజ్ఞప్తి చేశారు. పురపాలక సంఘం కమిషనర్ ఎన్.రామారావుకు గురువారం వినతిపత్రం అందించారు.

### చేపల మార్కెట్ మెరుగుకు చర్యలు

సోంపేట, న్యూస్‌టుడే: సోంపేట చేపల మార్కెట్ మెరుగు పంచాయతీ ఆధ్వర్యంలో చర్యలు చేపట్టారు. నెలల తరబడిగా మార్కెట్ పరిసరాలు శుభ్రం చేయకపోవడంతో వినియోగదారులు, విక్రయదారులు తీవ్ర అవస్థలు పడుతుండేవారు. పంచాయతీ ఈవో శాంతికుమారి పరిస్థితిని పరిశీలించి గురువారం దగ్గరుండి శుభ్రం చేయించారు. ఖాళీ సమయాల్లో పశువులు,కుక్కలు వెళ్లకుండా గేటు ఏర్పాటు చేశారు.

### తూనిక యంత్రాలకు మరమ్మతులు

వజ్రపుకొత్తూరు, న్యూస్‌టుడే: వజ్రపుకొత్తూరు మండలంలోని పలు చౌక దుకాణాలకు సంబంధించిన తూనిక యంత్రాలు మొరాయిస్తున్నాయి. రేషన్ సరకుల పంపిణీకి అటంకం కలిగిస్తున్నాయి. దీంతో తహసీల్దార్ కార్యాలయం వద్ద మరమ్మతులు చేసేందుకు డీలర్లు తూనిక యంత్రాలు తీసుకురావడంతో ఇలా దర్శనమిచ్చాయి. జిల్లా సాంకేతిక సహాయకులు పర్యవేక్షణలో యంత్రాలు మరమ్మతులు జరిగాయి. బ్లూటూత్, పవర్, బ్యాటరీలను మరమ్మతులు చేసి చక్కదిద్దారు. రేషన్ సరకుల పంపిణీ మరింత వేగవంతం చేసేందుకు చర్యలు తీసుకున్నట్లు ఉప తహసీల్దార్ మురళీ తెలిపారు.

### అధికారులతో జేసీ సమీక్ష



వజ్రపుకొత్తూరు, న్యూస్‌టుడే: ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అంతా అప్రమత్తంగా ఉండాలని మండల అధికారులను జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ ఆదేశించారు. మండల తహసీల్దార్ కార్యాలయంలో గురువారం తుపాను పై ముందస్తు సన్నద్ధతపై మండల అధికారులతో సమీక్ష చేశారు.

# టెక్కలి

•టెక్కలి •నరసన్నపేట •పాతపట్నం

## ఆర్థిక సాయం అందజేత

నరసన్నపేట, న్యూస్‌టుడే: అనారోగ్యానికి గురైన పి.ప్రసాదరావుకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన ఆర్థిక సాయాన్ని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అందజేశారు. సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి మంజూరైన రూ.70 వేల చెక్కును గురువారం ఆయన తెదేపా నాయకుల సమక్షంలో బాధితుడికి ఇచ్చారు.

## ఉన్నత ఫలితాలు సాధించాలి

టెక్కలి పట్టణం, న్యూస్‌టుడే: విద్యార్థినులు ఉన్నత ఫలితాలు సాధించాలని ఆర్డీవో ప్రగడ దుర్గారావు అన్నారు. స్థానిక జడ్పీ బాలికోన్నత పాఠశాల ప్లస్‌లో ఇంటర్మీడియట్ విభాగాన్ని గురువారం ఆకస్మికంగా పరిశీలించారు. సీట్లు పూర్తిగా భర్తీ కావడంపై హర్షం వ్యక్తం చేశారు. ఆయన వెంట ప్రధానోపాధ్యాయురాలు శోభారాణి, అధ్యాపకులు రమణ, ఆనందరావు, మోహన్, నాయుడు, శ్రీనివాస్, అప్పలస్వామి, శ్రీధర్ ఉన్నారు.

## తైక్వాండో పోటీలకు ఎంపిక

టెక్కలి పట్టణం, న్యూస్‌టుడే: టెక్కలిలోని ఎన్టీఆర్ క్రీడా వికాస కేంద్రంలో శిక్షణ పొందుతున్న బీటెక్ విద్యార్థి ఆరంగి సాగర్ ఆలిండియా యూనివర్సిటీ తైక్వాండో పోటీలకు ఎంపికైనట్లు శిక్షకుడు నర్సిపురం శేఖర్ తెలిపారు. విజయనగరం జేఎన్‌టీయూలో బుధవారం జరిగిన ఎంపిక ప్రక్రియలో అర్హత సాధించినట్లు చెప్పారు. శిక్షకుడితో పాటు డీఎస్‌డీవో కళ్లేపల్లి శ్రీధర్ క్రీడాకారుడిని అభినందించారు.



సాగర్‌తో శిక్షకుడు శేఖర్





## సత్తా చాటారు

విద్యార్థులు చిన్నతనం నుంచే ఉన్నత లక్ష్యాలు నిర్దేశించుకోవాలని టెక్కలి మండలం చాకిపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎం.అనురాధ అన్నారు. గురువారం 'ఈనాడు' ఆధ్వర్యంలో పాఠశాలలో ప్రతిభా పాటవ పోటీలు ఉత్సాహంగా జరిగాయి. 'అంతర్జాలం వినియోగం వల్ల లాభ నష్టాలు, విద్యార్థులపై సామాజిక మాధ్యమాల ప్రభావం' అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. కరుమోజి హర్షిత (తొమ్మిదో తరగతి), మొర్రి పూజ (పదో తరగతి), రాజమహంతి దక్షిణ్య (తొమ్మిదో తరగతి) ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. విజేతలకు ఉపాధ్యాయులు ప్రశంసాపత్రాలు అందించారు. –న్యూస్‌టుడే, టెక్కలి పట్టణం

## వినూత్నంగా.. విభిన్నంగా..!

టెక్కలిలో గోసంరక్షణ కేంద్రం ఏర్పాటు

టెక్కలి, టెక్కలి పట్టణం, న్యూస్‌టుడే: సమస్యను గుర్తించడంతో పాటు దాని పరిష్కారాన్ని ప్రయోజనకరంగా ఆలోచించడంలో రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఆదరణ అందరి మన్ననలు పొందుతోంది. టెక్కలిలో గురువారం ప్రారంభించిన గోసంరక్షణ కేంద్రం అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. టెక్కలి పట్టణంలో రహదారులను విస్తరించినప్పటికీ ఎక్కడికక్కడ పశువులు మందలు మందలుగా తిష్ట వేస్తుండటంతో అనుకున్న లక్ష్యాలు నెరవేరడం లేదు. ట్రాఫిక్ సమస్య తలెత్తుతుండటంతో పాటు నిత్యం ప్రమాదాలకు కారణమవుతున్నాయి. అదేవిధంగా పశువుల పేడతో రహదారులపై పారిశుద్ధ్య నిర్వహణ కష్టమవుతోంది. దీనిపై యజమానులకు ఎన్ని సార్లు హెచ్చరికలు జారీ చేసినా, ప్రకటనలు ఇచ్చినా స్పందన కనిపించడం లేదు. దీంతో గోసంరక్షణ కేంద్రం ఏర్పాటు చేయాలని నిర్ణయానికి వచ్చారు. జిల్లా ఆసుపత్రి పక్కనే ఎకరా స్థలాన్ని దీని కోసం కేటాయించి చుట్టూ కంచె వేశారు. పశువుల కోసం నీటి కుండీలు నిర్మించారు. గడ్డి, ఇతర దాణా సమకూర్చారు. రహదారిపై కనిపించే పశువులను ఇక్కడకు తరలించనున్నారు. వారం రోజుల్లోగా వాటి యజమానులు వస్తే అపరాధ రుసుం విధించి వారికి అప్పగిస్తారు. వారం రోజుల్లోగా ఎవరూ రాకుంటే ఇతర ప్రాంతాల్లో నిర్వహించే గోశాలలకు వీటిని తరలించే విధంగా చర్యలు చేపడతారు.

గోసంరక్షణ కేంద్రం ఇదే



### శాశ్వత పరిష్కారం దిశగా అడుగులు

ఎన్నో ఏళ్లుగా టెక్కలిలో రహదారుల మధ్య మందలు మందలుగా సంచరించే పశువులతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఎన్ని సార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా ఏం చేస్తామంటూ పెదవి విరవడమే తప్ప పరిష్కారం దక్కలేదు. సమయస్ఫూర్తితో కూడిన గోసంరక్షణ కేంద్రం ఏర్పాటు అటు ట్రాఫిక్ సమస్యకు, ప్రమాదాల నివారణకు, మెరుగైన పారిశుద్ధ్య నిర్వహణకు శాశ్వత పరిష్కారం చూపించింది. టెక్కలిలో ప్రారంభమైన వినూత్న ఆలోచన ఇతర ప్రాంతాలకు, పట్టణాలకు మార్గదర్శనం చేస్తుందని అంతా ఆశిస్తున్నారు.

## టెక్కలి విద్యార్థుల ప్రతిభ

టెక్కలి పట్టణం, న్యూస్‌టుడే: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థులు ఉప్పాడ ప్రణవ్, చిరంజీవి ప్రధాన్ రాష్ట్రస్థాయి స్కూల్‌గేమ్స్‌కు ఎంపికయ్యారని ప్రధానోపాధ్యాయుడు దాసరి నాగభూషణం తెలిపారు. తూర్పు గోదావరి జిల్లాలో ఈ నెల 26వ తేదీ నుంచి జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో 17 ఏళ్ల వయో విభాగంలో జిల్లా జట్టు తరఫున బరిలోకి దిగనున్నారని చెప్పారు. క్రీడాకారులను ప్రధానోపాధ్యాయుడితో పాటు పీడీలు రామిరెడ్డి, జగ్గమ్మ గురువారం అభినందించారు.



పోటీలకు ఎంపికైన క్రీడాకారులతో ప్రధానోపాధ్యాయుడు, పీడీ

## శ్రీముఖలింగేశ్వరుడి హుండీ ఆదాయం లెక్కింపు



శ్రీముఖలింగేశ్వరస్వామి హుండీ ఆదాయాన్ని దేవాదాయశాఖ అధికారులు, అర్చకులు, శ్రీసత్యసాయి భజన మండలి సభ్యుల ఆధ్వర్యంలో గురువారం లెక్కించినట్లు ఈవో పి.ప్రభాకరరావు తెలిపారు. ఆమదాలవలస ఆలయాల ఈవో టి.రవి సమక్షంలో హుండీ తాళాలను తెరిచి ఆదాయం లెక్కించగా రూ.2,02,758 ఆదాయం వచ్చినట్లు ఈవో తెలిపారు. జులై 30 నుంచి ఇప్పటివరకు 86 రోజులకు సంబంధించి వచ్చిన ఆదాయమని తెలిపారు. దేవాదాయశాఖ సిబ్బంది, అర్చకులు, శ్రీసత్యసాయి భజన మండలి సభ్యులు పాల్గొన్నారు.

–న్యూస్‌టుడే, జలుమూరు,

## ఒరిగిన స్తంభం



జాతీయ రహదారిపై టెక్కలి, కోటబొమ్మాళి మార్గంలో చాకిపల్లి కొత్తూరు ముందు వ్యవసాయ భూముల్లో విద్యుత్తు స్తంభం ఒరిగిపోయి ప్రమాదకరంగా కనిపిస్తోంది. ఏ మాత్రం పడినా ఆ ప్రాంతంలో సంచరించే రైతులకు ప్రమాదం తప్పదు. పైన ఉండే విద్యుత్తు తీగల ఆధారంగా నిలిచి ఉంది. దీన్ని సరిచేసేందుకు తగిన చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. ఈ విషయమై విద్యుత్తు శాఖ ఏఈ జీవీ సురేష్ స్పందిస్తూ క్షేత్ర స్థాయిలో సమగ్రంగా పరిశీలించి తగిన చర్యలు చేపడతామన్నారు.

–న్యూస్‌టుడే, కోటబొమ్మాళి

## ఆదమరిస్తే ప్రమాదమే..!



ఆంధ్రా-ఒడిశా ప్రధాన రహదారి మెళియాపుట్టి మండలం చాపర వద్ద కల్వర్టుకు పడిన రంధ్రం ప్రమాదకరంగా మారింది. నిత్యం వందలాది భారీ వాహనాలు, వేలాది ద్విచక్ర వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. రాత్రి సమయాల్లో ఆదమరిస్తే వాహనదారులు ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉంది. సంబంధిత ర.భ. శాఖ అధికారులు స్పందించి ప్రమాద సూచికలు ఏర్పాటు చేయాల్సి ఉంది. ఈ విషయమై ర.భ.శాఖ డీఈఈ సాగర్ దృష్టికి తీసుకువెళ్లగా రహదారుల పరిస్థితిపై ప్రతిపాదనలు పంపించామని, నిధులు మంజూరు కాగానే మరమ్మతులు చేపడతామన్నారు. –న్యూస్‌టుడే, మెళియాపుట్టి

## విద్యుత్తు తీగలు సరిచేయరూ..

నరసన్నపేట మండలం ఉర్లాం సాయివీధి శివారులో ఒక స్తంభం నుంచి మరో స్తంభానికి విద్యుత్తు సరఫరా చేసే తీగలు నేలను తాకేలా ఉండటంతో పరిసర నివాసితులు భయపడుతున్నారు. చిన్న పిల్లలు, పశువులకు తాకేంత ఎత్తున తీగలు ఉన్నాయని, ఎటువంటి ప్రమాదం జరగక ముందే వాటిని సరిచేయాలని వారు కోరుతున్నారు. ఈ విషయమై ఉర్లాం విద్యుత్తు ఉప కేంద్రం ఏఈ దృష్టికి తీసుకువెళ్లగా పరిశీలించి వాటిని సరిచేస్తామన్నారు.

–న్యూస్‌టుడే, నరసన్నపేట గ్రామీణం



## సమాచార బోర్డుల ఏర్పాటు





సారవకోట మండలంలోని మాళువ పంచాయతీలో ఉపాధి పనులకు సంబంధించిన సమాచార బోర్డులు ఎట్టకేలకు ఏర్పాటు చేశారు. ఈ పంచాయతీకి చెందిన నాలుగు సమాచార బోర్డులు మాళువ సంపద తయారీ కేంద్రం వద్ద గత కొన్ని నెలలుగా వృథాగా పడి ఉన్నాయి. ఈ విషయాన్ని 'ఈనాడు'లో ఈ నెల 24న 'లక్ష్యం వేరు.. నిర్లక్ష్యం తీరు' శీర్షికతో వార్త ప్రచురితం కావడంతో ఏపీవో నారాయణరావు స్పందించారు. పని ప్రదేశంలో వీటిని ఏర్పాటు చేయాలని క్షేత్ర సహాయకుడికి ఆయన సూచించడంతో ఏర్పాటు చేశారు. పని ప్రదేశంలో సమాచార బోర్డులు ఏర్పాటు చేయడంతో స్థానికుల్లో హర్షం వ్యక్తమైంది. –న్యూస్‌టుడే, సారవకోట

## అవీ..ఇవీ..అన్నీ

### రైలు ఢీకొని రెండు ఆవులు మృతి

పాతపట్నం, న్యూస్‌టుడే: పాతపట్నం మండలం గోపాలపురం గ్రామం వద్ద నాలుగు ఆవులను గురువారం రైలు ఢీకొంది. గోపాలపురం గ్రామానికి చెందిన రాము అనే రైతుకు చెందిన ఈ ఆవులు రైలు పట్టాలపై గడ్డి మేస్తున్నాయి. ఒక్కసారిగా రైలు వేగంగా వచ్చి ఢీకొనడంతో రెండు ఆవులు అక్కడికక్కడే మృతి చెందాయి. గాయపడిన రెండు ఆవులకు పశువైద్యులు వైద్య సేవలందించారు.

### కార్యకర్తలకు జనసేన అండగా ఉంటుంది

హిరమండలం, న్యూస్‌టుడే: జనసేన పార్టీ కార్యకర్తలకు పార్టీ అండగా ఉంటుందని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు పి చంద్రమోహన్, నియోజకగవర్గం నాయకులు కె.భవాని అన్నారు. గురువారం హిరమండలంలో వారు పర్యటించారు. గొట్ట గ్రామంలో అనారోగ్యంతో బాధపడుతున్న క్రియాశీల కార్యకర్తల కుటుంబాలను పరామర్శించారు. ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### శ్మశానవాటికకు దారి కల్పించండి

కొత్తూరు, న్యూస్‌టుడే: దళితుల శ్మశానవాటికకు రహదారి సదుపాయం కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు సిర్ల ప్రసాదరావు డిమాండ్ చేశారు. మండలంలోని పారాపురం అంబేడ్కర్ విగ్రహం ఎదుట గురువారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 20 ఏళ్లుగా రహదారి సమస్యపై స్థానికులు పోరాడుతున్నా గత వైకాపా పాలకులు పట్టించుకోలేదన్నారు. స్థానిక నాయకులు జి.రామారావు, కె.సింహాచలం, గోపి, శంకర్, రవి తదితరులు పాల్గొన్నారు.

### ముగిసిన నందెన్న ఉత్సవాలు

కోటబొమ్మాళి, న్యూస్‌టుడే: గత కొద్ది రోజులుగా వాడవాడలా జరుగుతున్న నందెన్న ఉత్సవాలు బుధవారం రాత్రిలో ముగిశాయి. ఈ నేపథ్యంలో కోటబొమ్మాళి మేజర్ పంచాయతీ వీధుల్లో నందెన్న ఊరేగింపులు, పూజలు విశేషంగా చేపట్టారు. పెద్ద ఎత్తున మహిళలు భాగస్వామ్యులయ్యారు.

### తెదేపా సోషల్ మీడియా కన్వీనరుగా అర్చన

నరసన్నపేట, న్యూస్‌టుడే: తెదేపా సోషల్ మీడియా కన్వీనరుగా బగ్గు అర్చన గురువారం బాధ్యతలు చేపట్టారు. తెదేపా భావాలను, సమాచారాన్ని మరింత సమర్థవంతంగా ప్రజలకు చేరవేసేందుకు తాను సోషల్ మీడియా కన్వీనరుగా బాధ్యతలు తీసుకున్నానని అర్చన తెలిపారు.

### నూతన కోర్టు సముదాయాలు నిర్మించాలి

టెక్కలి పట్టణం, న్యూస్‌టుడే: టెక్కలిలో సబ్ కోర్టును నిర్వహిస్తున్న జిల్లా ఆసుపత్రి పాత భవనం శిథిలస్థితికి చేరుకున్న కారణంగా కొత్త భవనాలు నిర్మించాలని టెక్కలి బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు డీవీ వివేకానంద, ఎస్.దివాకర్ కోరారు. ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి, శ్రీకాకుళం జిల్లా పరిపాలన న్యాయమూర్తి సత్తి సుబ్బారెడ్డిని బుధవారం హైకోర్టులో కలిసి వినతిపత్రం అందజేశారు. ఖాళీగా ఉన్న సీనియర్ సివిల్ జడ్జి పోస్టు భర్తీచేయాలని విన్నవించారు.



### పశుగణన సమగ్రంగా నిర్వహించాలి

పాతపట్నం, న్యూస్‌టుడే: అఖిల భారత పశుగణనను సమగ్రంగా నిర్వహించాలని పాతపట్నం ప్రాంతీయ పశువైద్యశాల సహాయ సంచాలకులు డా. ఎం.కరుణాకర్‌రావు అన్నారు. గురువారం పాతపట్నం పశువైద్యశాలలో పాతపట్నం, మెళియాపుట్టి మండలాల పశు వైద్యులు, సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 25 నుంచి వచ్చే ఏడాది ఫిబ్రవరి 28వ తేదీ వరకు గణన జరుగుతుందన్నారు. డా. బి.శ్రీవాణి, అనిల్, మౌనికతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.



### ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటరుగా నమోదు చేసుకోవాలి

హిరమండలం, న్యూస్‌టుడే: ఉపాధ్యాయులు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటరుగా నమోదు చేసుకోవాలని యూటీఎఫ్ కార్యవర్గ సభ్యుడు చౌదరి రవీంద్ర అన్నారు. గురువారం కోరాడ కాలనీ ఎంపీయూపీ పాఠశాల ఆవరణలో ఆ శాఖ ఉపాధ్యాయుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సంఘ జిల్లా కార్యదర్శి బోడ శ్రీను, కొత్తూరు, హిరమండలం శాఖల నాయకులు ప్రకాష్, కోటేశ్వరరావు, శంకరరావు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.



### ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చోరీ

నరసన్నపేట: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకానికి చెందిన వస్తువులు చోరీకి గురయ్యాయి. వంటగది తాళాలు విరగొట్టి పాత్రలు, కిరాణా సామగ్రి దొంగిలించారని వంట నిర్వాహకులు తెలిపారు. వంట చేసేందుకు గురువారం ఉదయం తలుపులు తీసే క్రమంలో చోరీ జరిగినట్లు గుర్తించినట్లు నిర్వాహకులు చెప్పారు. ఈ మేరకు ప్రధానోపాధ్యాయుడు వెంకటరావు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

## ఎక్కువ కేసుల రాజీకి సహకరించండి





న్యాయవాదులతో సమావేశం నిర్వహిస్తున్న న్యాయమూర్తి హరిప్రియ

టెక్కలి పట్టణం, న్యూస్‌టుడే: టెక్కలి కోర్టుల సముదాయంలో డిసెంబరు 14న జరగనున్న జాతీయ లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకొని ఎక్కువ కేసుల రాజీకి సహకరించాలని అదనపు జూనియర్ సివిల్ జడ్జి సీహెచ్.హరిప్రియ కోరారు. టెక్కలి కోర్టుల పరిధిలోని న్యాయవాదులు, పోలీసు అధికారులతో గురువారం వేర్వేరుగా సమావేశాలు నిర్వహించారు. రాజీకి అనుకూలమైన వీలైనన్ని ఎక్కువ కేసులు పరిష్కరించేందుకు సహకరించాలన్నారు.

## సమస్యల పరిష్కారానికి పోరాటం చేద్దాం

మెళియాపుట్టి, న్యూస్‌టుడే: ఉపాధ్యాయుల దీర్ఘకాలిక సమస్యల పరిష్కారానికి ఐక్యంగా పోరాడుదామని ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పి.రఘువర్మ అన్నారు. గురువారం మండలంలోని గొప్పిలి, కరజాడ, భరణికోట, పెద్దమడి, జాడుపల్లి, పెద్దలక్ష్మీపురం, జూనియర్ కళాశాల, కస్తూరిబా, మెళియాపుట్టి ఉన్నత పాఠశాలలను సందర్శించి ఉపాధ్యాయుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రానున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఏపీటీఎఫ్ ప్రతినిధిగా ఆయన బరిలో నిలవనున్నట్లు పేర్కొన్నారు. బి.డిల్లీశ్వరరావు, జె.ధర్మారావు, కామేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.



మెళియాపుట్టి ఉన్నత పాఠశాలలో మాట్లాడుతున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ రఘువర్మ



సదస్సులో వినతులు స్వీకరిస్తున్న రెవెన్యూ అధికారులు

### భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు

ఎల్ఎన్‌పేట, న్యూస్‌టుడే: మండలంలోని రావిచెంద్రి, చొర్లంగి గ్రామాల సచివాలయాల్లో రెవెన్యూ అధికారులు గురువారం రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. జడ్పీటీసీ మాజీ సభ్యుడు ఎస్. తేజేశ్వరరావు మాట్లాడుతూ రైతులు ఎదుర్కొంటున్న భూ సమస్యలను గుర్తించి ముఖ్యమంత్రి ఈ సదస్సులు ఏర్పాటు చేశారన్నారు.

## గ్రామసభ రసాభాస

సారవకోట, న్యూస్‌టుడే: మండలంలోని అలుదు గ్రామంలో గురువారం ఉపాధి పనులకు సంబంధించి గురువారం జరిగిన సామాజిక తనిఖీ గ్రామసభ రసాభాసగా మారింది. మొదట సామాజిక తనిఖీ బృందం సభ్యులు గుర్తించిన అంశాలను డీఆర్పీ అప్పారావు సభకు తెలియజేశారు. అనంతరం కొందరు గ్రామసభలో ఫిర్యాదులు చేయడంతో తెదేపా, వైకాపా నాయకుల మధ్య మాటల యుద్ధం కొనసాగి, రసాభాసకు దారితీసింది. ఎస్సై అనీల్‌కుమార్ సిబ్బందితో అక్కడికి చేరుకొని సభను సజావుగా జరిపించారు. పని ప్రదేశంలో సౌకర్యాలు లేక వేతనదారులు ఇబ్బందులు పడుతున్నారని స్థానిక తెదేపా నాయుడు చల్ల ఆనందరావు తెలిపారు. సర్పంచులు, వేతనదారులు పాల్గొన్నారు.

## డీఎస్పీ దర్యాప్తు

జలుమూరు, న్యూస్‌టుడే: మండలంలోని మర్రివలస పంచాయతీ మాయికివలస(ఎస్టీ)లో ఇటీవల గ్రామస్థులకు హరే రామ, హరే కృష్ణ భక్తుల మధ్య జరిగిన తగాదాలో ఇరువర్గాలపై కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. కులం పేరుతో తమను దూషించారని మాకివలస గ్రామస్థులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అప్పట్లో అట్రాసిటీ కేసు నమోదు చేశారు. దీనిపై అదనపు ఎస్పీ (క్రైం) పి.శ్రీనివాసరావు గురువారం దర్యాప్తు చేపట్టారు. ఫిర్యాదుదారులు, గ్రామస్థుల నుంచి వివరాలు సేకరించారు. వివరాలను ఉన్నతాధికారులకు నివేదిస్తున్నట్లు తెలిపారు. హెచ్‌సీ కమలాకర్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు

## మాది చేతల ప్రభుత్వం

కొత్తూరు, న్యూస్‌టుడే: గత వైకాపా పాలకులు కేవలం మాటలతో కాలం వెల్లదీస్తే కూటమి ప్రభుత్వం చేతల ప్రభుత్వమని నిరూపిస్తుందని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. మండలంలోని నివగాం, ఆకుల తంపర గ్రామాల్లో వంశధార నదీ తీరం వద్ద ఉచిత ఇసుక పంపిణీని గురువారం ఆయన ప్రారంభించారు. ప్రభుత్వాన్ని ఆర్థిక కష్టాలు వెంటాడుతున్నా ఆదాయాన్ని వదులుకొని, సీనరేజి ఛార్జీలు రద్దు చేసిన ఘనత సీఎం చంద్రబాబునాయుడుదేనన్నారు. టెక్కలి ఆర్డీవో కృష్ణమూర్తి, మండల తెదేపా నాయకులు అరుణ్‌కుమార్, మాతల గాంధీ, నూలు వీరభద్రస్వామి, కన్నయ్యస్వామి, అధికారులు, ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



నివగాంలో ఇసుక పంపిణీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మామిడి గోవిందరావు

## రైతు బజార్లు లేక ఇక్కట్లు..!

–న్యూస్‌టుడే, కొత్తూరు, పాతపట్నం

వైకాపా ప్రభుత్వ పాలకులు గత ఐదేళ్లలో కూరగాయల రైతుల ఇబ్బందులను పట్టించుకోలేదు. రైతు బజార్లను ఏర్పాటు చేసి తాము పండించిన ఆకుకూరలు, కాయగూరలకు గిట్టుబాటు ధర లభించేలా చూడాలని అప్పటి పాలకులకు వారు మొరపెట్టుకున్నా ఫలితం లేకపోయింది. దీంతో రైతులు ఆరుబయటే కూరగాయలను తక్కువ ధరలకు దళారులు, ప్రజలకు విక్రయించుకోవాల్సి వచ్చింది. దీంతో వారు ఆర్థికంగా నష్టపోయారు. ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం పైన పాతపట్నం నియోజకవర్గంలోని రైతులు ఆశలు పెట్టుకున్నారు.

**గిట్టుబాటు కాక..:** గత వైకాపా ప్రభుత్వం పాతపట్నంతో పాటు వ్యాపార కేంద్రాలైన కొత్తూరు, హిరమండలం, ఎల్ఎన్‌పేట, మెళియాపుట్టిల్లో రైతు బజార్లు ఏర్పాటు చేస్తామని పేర్కొంది. కూరగాయల రైతులు దళారుల బారిన పడకుండా గిట్టుబాటు ధర వచ్చేలా చూస్తామని తెలిపింది. కాని వాటిని ఏర్పాటు చేయలేదు.

**మండలాల్లో పరిస్థితి:** **కొత్తూరు:** మండలంలోని కర్లెమ్మ, కొత్తూరు, సిరుసువాడ, కుంటిభద్ర, మాతల, పొన్నుటూరు, లబ్బ, ఇరపాడు, కొత్త కొత్తూరు గ్రామాల్లో సుమారు 500 ఎకరాల్లో కూరగాయల పంటలను సాగు చేస్తున్నారు. టమాట, బీర, వంకాయలు, చిక్కుడు, బెండ, ఉల్లి, కొత్తిమీర, ఇతర ఆకుకూరల పంటలు పండిస్తున్నారు. వీరు కొత్తూరులో ఆరుబయట రహదారిపైనే ఉదయం పూట విక్రయాలు చేస్తున్నారు. కొన్నిమార్లు గిట్టుబాటు ధర రాకపోవడంతో ఆర్థికంగా నష్టపోతున్నారు.



కొత్తూరులో ఆరుబయటే కూరగాయలు విక్రయిస్తున్న రైతులు

**మెళియాపుట్టి:** మండలంలోని మెళియాపుట్టి, పెద్ద పద్మాపురం, జాడుపల్లి, మర్రిపాడు(సి), తదితర గ్రామాల్లో వివిధ కూరగాయల పంటలను సుమారు 300 ఎకరాల్లో సాగు చేస్తున్నారు. స్థానికంగా రైతు బజారు లేక పాతపట్నం, ఒడిశాలోని పర్లాఖెముండికి వెళ్లి అమ్ముకోవాల్సి వస్తుంది.

**హిరమండలం:** మండలంలోని అక్కరాపల్లి, అంకతాపల్లి, ఎల్ఎన్‌పేట మండలంలోని ఎల్ఎన్‌పేట, పెద్ద కోట గ్రామాల్లో కూరగాయల సాగు చేస్తున్నారు. పాతపట్నం మండలంలోని పాతపట్నం, కాగువాడ, కొరసవాడ, సీది, షరాళి తదితర గ్రామాల్లో ఆకు కూరలు, కూరగాయల పంటలను అన్నదాతలు పండిస్తున్నారు. అయిదు మండలాల్లోనూ రైతు బజార్లు లేక, స్థానికంగా గిట్టుబాటు ధర లేక రైతులు ఇబ్బంది పడుతున్నారు.

**అన్నదాతల ఇబ్బందులు తీరుస్తాం:** పాతపట్నం నియోజకవర్గంలోని అయిదు మండలాల్లో కూరగాయల రైతుల ఇబ్బందులను తీర్చేందుకు తగిన చర్యలు చేపడతాం. ఈ మేరకు వ్యవసాయ, మార్కెటింగ్ శాఖల ఆధ్వర్యంలో ప్రతిపాదనలు తయారుచేసి, ప్రభుత్వానికి నివేదిస్తాం. రైతు బజార్ల నిర్మాణానికి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటాం.

–మామిడి గోవిందరావు, ఎమ్మెల్యే, పాతపట్నం

## సభ్యత్వ నమోదులో ప్రథమ స్థానంలో ఉందాం

నరసన్నపేట, పోలాకి, న్యూస్‌టుడే: తెదేపా సభ్యత్వ నమోదులో నరసన్నపేట నియోజకవర్గాన్ని అగ్రభాగాన నిలుపుదామని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. స్థానిక సౌభాగ్యలక్ష్మి కల్యాణ మండపంలో గురువారం తెదేపా విస్తృత స్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తెదేపా సోషల్ మీడియా కన్వీనరు బగ్గు అర్చన, తెదేపా నాయకులు శిమ్మ చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు. ★ పోలాకి మండలంలో చేపట్టనున్న తెదేపా సభ్యత్వ నమోదుపై విస్తృత ప్రచారం జరగాలని, ఇందుకు మీరంతా శ్రద్ధ చూపాలని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. ఈదులవలస గ్రామం దరి ఓ కల్యాణ మండపంలో నిర్వహించిన కార్యకర్తల అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడారు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి

శ్రీకాకుళం
•శ్రీకాకుళం •ఆమదాలవలస •ఎచ్చెర్ల

**మేమున్నాం.. మీకు తోడుగా** (10 AM TO 1 PM) 9502198883 8008552704

మీ ప్రాంతంలో ఏ ప్రజా సమస్యనైనా పరిష్కరించే క్రమంలో 'ఈనాడు' మీకు తోడుగా ఉంటుంది. వివరాలను, చిత్రాలను వాట్సాప్ ద్వారా పంపవచ్చు. లేదా ఫోన్లో వివరించవచ్చు. వాటిని బాధ్యుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తాం.

**తెరపై ఈనాడు**

★ కీర్తన: వేణం ★ కీర్తి: లగం ★ కిన్నెర సినీమాక్స్: పొట్టేల్ ★ ఎస్‌వీసీ(రామలక్ష్మణ): వేట్టయన్ ★ సూర్యమహల్: విశ్వం ★ సరస్వతి: దేవర ★ చంద్రమహల్: సరుకు బ్రతుకు నటన ★ మారుతి: సముద్రుడు

– న్యూస్‌టుడే, అరసవల్లి

## వైభవంగా సహస్ర దీపారాధన పూజలు



పాత శ్రీకాకుళం నక్క వీధిలో ఉమాజఠలేశ్వరాలయంలో గౌరీదేవి ఉత్సవాల్లో భాగంగా గురువారం సహస్ర దీపారాధన పూజలు నిర్వహించారు. సమీప కాలనీలకు చెందిన భక్తులు భారీఎత్తున పాల్గొన్నారు.
– న్యూస్‌టుడే, శ్రీకాకుళం సాంస్కృతికం

## విద్యార్హత నమోదుకు ప్రత్యేక డ్రైవ్

బలగ(శ్రీకాకుళం),న్యూస్‌టుడే: నగరంలోని ప్రభుత్వ మహిళా కళాశాలలో గురువారం విద్యార్హత నమోదుకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. విద్యార్థులు ఇంటి నుంచే వివరాలు నమోదు చేసుకునే పద్ధతిపై అవగాహన కల్పించారు. ఉపాధి అధికారి కె. సుధ, ప్రిన్సిపల్ సూర్య పాల్గొన్నారు.

## విజేతలుగా నిలిచారు



ఆమదాలవలస పురపాలక పరిధిలోని మెట్టక్కివలస మున్సిపల్ బాలికోన్నత పాఠశాలలో గురువారం 'ఈనాడు' ఆధ్వర్యంలో 8, 9, 10వ తరగతి విద్యార్థులకు ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించారు. ఇందులో భాగంగా అంతర్జాల వినియోగంతో లాభనష్టాలు, విద్యార్థులపై సామాజిక మాధ్యమాల ప్రభావం అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. పదో తరగతి విద్యార్థులు డి.ఖిళిత, ఎస్.బాల, ఏ.యోషిత వరుస మూడు స్థానాల్లో విజేతలుగా నిలిచారు. వారికి పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కె.విజయలక్ష్మి, ఉపాధ్యాయులు జె.అనంతరావు, ఎస్.మల్లేశ్వరావు, జె.సుశీల ప్రశంసాపత్రాలు, బహుమతులు అందజేశారు.
– న్యూస్‌టుడే, ఆమదాలవలస పట్టణం



# ఉన్నా.. ఉపయోగమేదీ?

## నగరంలో వృథాగా సామాజిక మరుగుదొడ్లు



డే అండ్ నైట్ కూడలి వద్ద ఏర్పాటు చేసిన మరుగుదొడ్లు

– న్యూస్‌టుడే, శ్రీకాకుళం నగరం

ఏ ప్రభుత్వ శాఖలకు లేని విధంగా స్థానిక సంస్థలు ప్రజల నుంచి ఆస్తి, ఇతర పన్నుల వసూలు చేసి ఆ నిధులతో ప్రజా అవసరాలకు ఖర్చు చేసే వెసులుబాటును ప్రభుత్వం కల్పించింది. అందులో భాగంగా ఏటా పన్నుల రూపంలో శ్రీకాకుళం నగరపాలక సంస్థకు కోట్ల రూపాయల ఆదాయం సమకూరుతున్నా.. వాటి వినియోగంలో అధికారుల అలసత్వం, పర్యవేక్షణ లోపంతో వృథా అవుతోంది. ఇందుకు నిదర్శనమే నగరంలోని రద్దీ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన సామాజిక మరుగుదొడ్లు.

**నిర్వహణ గాలికి..**

స్వచ్ఛ భారత్, స్వచ్ఛ శ్రీకాకుళం కార్యక్రమంలో భాగంగా కొన్నేళ్ల కిందట నగరంలోని రద్దీ ఉండే ప్రాంతాల్లో వీటిని ఏర్పాటు చేశారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా హయాతీనగరం రెల్లివీధి, పెద్దరెల్లివీధి, కత్తెరవీధి, ఇల్లీసుపురం రాయివీధి, మంగువారితోట, ఆదివారంపేట, తితిదే కల్యాణ మండపం, అరసవల్లి ఉన్నతపాఠశాల, గొంటివీధి, గుడివీధి, రంగిరీజు వీధి, పలు కాలనీలతోపాటు నగరంలోని రద్దీగా ఉండే డే అండ్ నైట్, పాతబస్టాండ్‌లలో సామాజిక మరుగుదొడ్లను నగరపాలక సంస్థ ఏర్పాటు చేసింది. మంచినీటి పైపులైన్లు, విద్యుత్తు సౌకర్యం ఏర్పాటు చేయడంతో పాటు తెదేపా ప్రభుత్వంలో వాటి నిర్వాహణను ప్రైవేటు సంస్థలకు అప్పగించారు. గత వైకాపా ప్రభుత్వం నిర్వాకం, నగరపాలక సంస్థ అధికారులు నిర్లక్ష్యంతో వాటి నిర్వహణను వదిలేశారు. దీంతో నేడు ఆ మరుగుదొడ్లు పూర్తిగా శిథిలావస్థకు చేరుకుని ప్రజలు వాడుకునేందుకు ఏ మాత్రం అనువుగా లేకుండా పోయాయి.

**అటకెక్కిన లక్ష్యం..**

నగరంలోని ఆయా కాలనీల పేదలు, ముఖ్య కూడళ్లలో ప్రజలు ఎప్పటి మాదిరిగానే బహిరంగ మూత్ర, మల విసర్జన చేస్తుండటంతో బహిరంగ మూత్ర విసర్జన నిషేధ లక్ష్యం అటకెక్కిపోయింది. ఆయా ప్రాంతాలు అపరిశుభ్రతకు చిరునామాగా మారటంతోపాటు ఆ ప్రాంతాల్లోని నీటి వనరులు కలుషితమవుతున్నాయి. ఏటా అక్టోబర్ 2వ తేదీన స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో భాగంగా నగరపాలక సంస్థ ర్యాలీలు, సదస్సులకు పరిమితమవుతున్నారే తప్ప ఆచరణలో విఫలం చెందుతున్నారు. ఇప్పటికైనా నగరపాలకసంస్థ అధికారులు స్పందించి నిరుపయోగంగా ఉన్న మరుగుదొడ్లను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని పలువురు కోరుతున్నారు.



పెద్ద రెల్లివీధిలో నిరుపయోగంగా..

**పరిశీలిస్తాం..**

మరుగుదొడ్లను పరిశీలించి అందుబాటులోకి తీసుకువచ్చే దిశగా చర్యలు తీసుకుంటాం.
– ప్రసాదరావు, నగరపాలకసంస్థ కమిషనర్



## సత్తా చాటారు




పాత శ్రీకాకుళంలోని టీపీఎం ఉన్నత పాఠశాలలో గురువారం 'ఈనాడు' ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించారు. అంతర్జాల వినియోగంతో లాభ నష్టాలు, విద్యార్థులపై సామాజిక మాధ్యమాల ప్రభావం అనే అంశంపై వ్యాసరచన పోటీలు జరిగాయి. వి.కోకిల (పదో తరగతి), బి.అలెక్స్ (8వ తరగతి), పి.పుష్పాంజలి (9వ తరగతి) వరుస స్థానాల్లో నిలిచారు. విజేతలకు ఉపాధ్యాయులు టి.నీరజా కుమారి, కె.వసంతకుమారి తదితరులు బహుమతులు అందజేశారు.
– న్యూస్‌టుడే, కలెక్టరేట్(శ్రీకాకుళం)

## శిథిల భవనం.. భయం భయం



గార మండలం శ్రీకూర్మం పంచాయతీ మెండపేటలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల అవరణలో అంగన్‌వాడీ భవనం శిథిల స్థితికి చేరింది. ఇక్కడికి వచ్చే పిల్లల భద్రతపై తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. 15 ఏళ్లు దాటని భవనం గోడలు బీటలు వారి గచ్చు కుంగిపోయింది. వర్షం పడితే చెమ్మతో గోడలు మరింత ప్రమాదకరంగా కనిపిస్తున్నాయని.. ఇక్కడ అంగన్‌వాడీ కేంద్రం నిర్వహించడం సరికాదని గ్రామస్థులు చెబుతున్నారు. ఈ విషయమై మండల ఇంజినీరు గోవిందరావును 'న్యూస్‌టుడే' సంప్రదించగా అంగన్‌వాడీ కేంద్రం నిర్వహిస్తున్న భవనం నివాస యోగ్యంగా లేదని తెలిపారు.
– న్యూస్‌టుడే, గార

## విద్యుత్తు తీగలతో ప్రమాదం



ఆమదాలవలస మండలం వంజంగి గ్రామంలో ఇళ్ల పైనుంచి వీధుల్లో విద్యుత్తు తీగలు వేలాడుతుండటంతో భయాందోళనకు గురవుతున్నామని గ్రామస్థులు వాపోతున్నారు. గ్రామంలోకి ఎటువంటి భారీ వాహనం వచినా విద్యుత్తు తీగలు తగలడంతో అవి తెగిపోతున్నాయని పేర్కొంటున్నారు. అధికారులు తక్షణమే స్పందించి వాటిని తొలగించాలని కోరుతున్నారు. పరిశీలించి విద్యుత్తు తీగలు తొలగించే విధంగా చర్యలు చేపడతామని ఆ శాఖ రూరల్ ఏఈ రవికుమార్ తెలిపారు.
– న్యూస్‌టుడే, ఆమదాలవలస గ్రామీణం



## మహిళా సంఘాలకు ఆర్థిక తోడ్పాటు


మెప్మా బజార్‌ను పరిశీలిస్తున్న నగరపాలక సంస్థ కమిషనర్ ప్రసాదరావు

శ్రీకాకుళం నగరం, న్యూస్‌టుడే: మెప్మా పరిధిలోని స్వయం సహాయక సంఘాల (ఎస్‌హెచ్‌జీ) మహిళలు తయారు చేసే ఉత్పత్తుల విక్రయాలకు పట్టణాల్లో ఏర్పాటు చేస్తున్న అర్బన్ మార్కెట్‌లతో ఆర్థిక తోడ్పాటు లభించనుందని నగరపాలక సంస్థ కమిషనర్ పీవీవీడీ ప్రసాదరావు అన్నారు. మెప్మా ఆధ్వర్యంలో శ్రీకాకుళం నగరంలోని రైతు బజారు సమీపంలో ఏర్పాటు చేసిన అర్బన్ మార్కెట్‌ను గురువారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాల బలోపేతానికి ప్రభుత్వం అందిస్తున్న సహకారాన్ని సభ్యులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పోటీ ప్రపంచానికి అనుగుణంగా ఉత్పత్తులు తయారు చేయాలని సూచించా. స్త్రీనిధి అధ్యక్షురాలు కె.నాగలక్ష్మి, మెప్మా సిబ్బంది ఎస్.వెంకటరావు, బి.భాస్కరరావు, బి.రామారావు తదితరులు పాల్గొన్నారు.



## కణుగుల పద్మజ స్మారక కళా పురస్కారం ప్రదానం



శ్రీకాకుళం నగరంలోని డే అండ్ నైట్ కూడలి వద్ద ఓ హోటల్‌లో గురువారం శ్రీవేన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రసిద్ధ వైణికురాలు కణుగుల పద్మజ జయంతి సందర్భంగా ఆమె పేరిట స్మారక కళా పురస్కారం ప్రదానోత్సవం, డా. చట్టి రామకృష్ణ వీణావాదన సంగీత నీరాజనం కార్యక్రమం నిర్వహించారు. శ్రీవేన్ ఫౌండేషన్ అధ్యక్షుడు డా. కణుగుల సుధీర్ ఆధ్వర్యంలో రెడ్‌క్రాస్ సంస్థ అధ్యక్షుడు పి. జగన్మోహన్‌రావు, నేత్ర వైద్య నిపుణుడు డా. దినేష్, రేడియాలజిస్టు డా. కె. సహజ, డా. కోమలరావు, వైకుంఠరావు డా. చట్టి రామకృష్ణకు పురస్కారం అందజేసి సత్కరించారు.
– న్యూస్‌టుడే, శ్రీకాకుళం సాంస్కృతికం

## ఘనంగా ఐక్యరాజ్య సమితి ఆవిర్భావ దినోత్సవం

కలెక్టరేట్(శ్రీకాకుళం),శ్రీకాకుళం అర్బన్, న్యూస్‌టుడే: శ్రీకాకుళం నగరంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో గురువారం ఐక్యరాజ్య సమితి ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ సూర్యచంద్రరావు మాట్లాడుతూ అంతర్జాతీయ చట్టం, భద్రత, ఆర్థిక, సామాజికాభివృద్ధి, మానవ హక్కుల పరిరక్షణకు సమష్టిగా కృషి చేసేందుకు ప్రపంచ దేశాలు ఏర్పాటు చేసుకున్న అంతర్జాతీయ సంస్థ ఐక్యరాజ్యసమితి అని తెలిపారు. ❖ శ్రీకాకుళం నగరంలోని ఆర్ట్స్ కళాశాల ఆవరణలో వాకర్స్ ఇంటర్నేషనల్ సంస్థ 102 ఆధ్వర్యంలో ఐక్యరాజ్య సమితి ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.

## రక్షిత భవనాల్లో వసతులు ఉండాలి

గార, న్యూస్‌టుడే: దానా తుపాను కారణంగా ఎదురయ్యే పరిస్థితులను ఎదుర్కొనేందుకు రక్షిత భవనాల్లో అన్ని వసతులు ఉండేలా చర్యలు చేపట్టాలని తహసీల్దారు ఎస్.రమణారావుకు ప్రత్యేక అధికారిణి, ఐసీడీఎస్ పీడీ శాంతిశ్రీ సూచించారు. మండలంలోని నగరాలపేట, బందరువానిపేటలో తుపాను రక్షిత భవనాలను గురువారం ఆమె పరిశీలించారు. కళింగపట్నం, బోరవానిపేట, బందరువానిపేట అంగన్‌వాడీ కేంద్రాల ఆవరణల్లో సిద్ధం చేస్తున్న న్యూట్రిగార్డెన్లను సందర్శించారు.



## అవీ.. ఇవీ.. అన్నీ

### ప్రభుత్వ భవనంలోకి అంగన్‌వాడీ కేంద్రం

పొందూరు, న్యూస్‌టుడే: పొందూరు మండలం కృష్ణాపురంలో ఎమ్మెల్యే కూన రవికుమార్ చొరవతో అంగన్‌వాడీ కేంద్రాన్ని ఖాళీగా ఉన్న ప్రభుత్వ భవనంలోకి తరలించినట్లు సర్పంచి అంబల్ల లక్ష్మి తెలిపారు. ఇటీవల పల్లె పండుగ కార్యక్రమానికి వచ్చిన ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా ఆయన సూచనల మేరకు కేంద్రాన్ని తరలించినట్లు ఆమె చెప్పారు.

### వనాల సంరక్షణతో మనుగడ



శ్రీకాకుళం నగరం, న్యూస్‌టుడే: వనాల సంరక్షణతోనే మానవాళి మనుగడ సాధ్యమని, మొక్కల పరిరక్షణకు అంతా పాటుపడాలని జిల్లా పౌర సంబంధాల అధికారి బాలమాన్ సింగ్ అన్నారు. జిల్లా డ్రైవర్స్ వెల్ఫేర్ అసోషియేషన్ ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా గురువారం శ్రీకాకుళం నగరంలోని పి.ఎస్.ఎన్.ఎం.పాఠశాల ఆవరణలో సంఘం ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బి.భాస్కరరావు, సంఘ నాయకులు ఆర్.గణపతిరావు తదితరులు పాల్గొన్నారు.

### భూ సమస్యల పరిష్కారానికే గ్రామ సభలు

ఆమదాలవలస గ్రామీణం, సరుబుజ్జిలి,న్యూస్‌టుడే: రైతుల భూ సమస్యలు పరిష్కారానికే గ్రామ సభలు చేపడుతున్నామని తహసీల్దార్ రాంబాబు తెలిపారు. ఆమదాలవలస మండలం మర్రికొత్తవలసలో గురువారం నిర్వహించిన భూ రీ సర్వే గ్రామ సభలో ఆయన పాల్గొన్నారు. ❖ భూ రీసర్వే పూర్తయిన గ్రామాల్లో నిర్వహిస్తున్న గ్రామ సభలకు రైతులు హాజరై సమస్యలను తెలపాలని సరుబుజ్జిలి తహసీల్దార్ మధుసూదన అన్నారు.

### రైతులకు సాగుహక్కు కల్పించాలి

ఎచ్చెర్ల, న్యూస్‌టుడే: మండలంలోని చిలకపాలెం పంచాయతీ నారాయణపురంలో రైతులకు సాగుహక్కు, విద్యుత్తు ఇందన సర్దుబాటు ఛార్జీల ప్రతిపాదన, వ్యవసాయ పంపుసెట్లుకు మీటర్లు తొలగింపు వంటి పలు అంశాలపై ప్రభుత్వాన్ని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు పి.తేజేశ్వరరావు ప్రశ్నించారు. మండలం చిలకపాలెంలో సీపీఎం శాఖ మహాసభ నిర్వహించారు. ముందుగా పార్టీ జెండాను ఎగురవేసి అనంతరం మాట్లాడారు. సీపీఎం నాయకులు తోనంగి నందోడు, పి.చంద్రరావు, జి.కృష్ణారావు, తదితరులు పాల్గొన్నారు.

### పొందూరు ఖాదీ అద్భుతం

పొందూరు, న్యూస్‌టుడే: ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన పొందూరు ఖాదీ వస్త్రాలు బాగున్నాయని జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి కొండపల్లి శ్రీనివాసరావు సతీమణి సింధు, కుటుంబ సభ్యులు అన్నారు. పొందూరులో వచ్చిన వారు గ్రామ దేవత పైడితల్లి అమ్మవారిని దర్శించుకుని ఆలయ ప్రాంగణంలో మొక్కలు నాటారు. వీరితోపాటు తెదేపా మండల అధ్యక్షుడు సీహెచ్.రామ్మోహన్, దండా రవి ఉన్నారు.

### మిస్టర్ ఆంధ్రా బాడీ బిల్డింగ్ పోటీలకు ఎంపిక

విజయనగరంలో నిర్వహించనున్న మిస్టర్ ఆంధ్రా బాడీ బిల్డింగ్ పోటీలకు జిల్లా నుంచి పలువురు ఎంపికయ్యారు. శ్రీకాకుళం నగరంలోని గోపాల్ జిమ్ నుంచి 55 కిలోల విభాగంలో పి.రాజేష్, 60 కిలోల విభాగంలో ఎం.రఫీఖాన్, 65 కిలోల విభాగంలో డి.గణేష్, ఆమదాలవలస ఏయూ జిమ్ నుంచి ఆర్.హరీష్, 65 కిలోల విభాగంలో ఎన్.రాజు, ఆదిత్య జిమ్ నుంచి 60 కిలోల విభాగంలో కె.సుమంత్, 70 కిలోల విభాగంలో ఆర్.గణేష్ (పలాస) ఎ.భాస్కరరావు ఎంపికయ్యారు. వారిని గోపాల్ ఫిట్‌నెస్ అధినేత గోపాల్, శ్రీకాకుళం బాడీ బిల్డర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బలగ ప్రసాద్, తదితరులు అభినందించారు.
– న్యూస్‌టుడే, శ్రీకాకుళం అర్బన్



## ఆక్రమణలు తొలగించకుంటే చర్యలు


మార్కెట్‌లో ఆక్రమణలను పరిశీలిస్తున్న నగరపాలక సంస్థ కమిషనర్ ప్రసాదరావు, డీఎస్పీ వివేకానంద

శ్రీకాకుళం నగరం, న్యూస్‌టుడే: శ్రీకాకుళం నగరంలోని పొట్టి శ్రీరాములు కూరగాయల మార్కెట్, ఏడు రోడ్ల కూడలి నుంచి అరసవల్లి మిల్లు కూడలి వరకు రహదారుల పక్కన ఖాళీ స్థలాలను ఆక్రమించి వ్యాపారాలు చేస్తున్న వారు వాటిని తొలగించకుంటే చర్యలు తప్పవని నగరపాలక సంస్థ కమిషనర్ పీవీవీడీ ప్రసాదరావు హెచ్చరించారు. మార్కెట్, కళింగ రహదారిలోని దుకాణాల ముందు ఖాళీ స్థలాలను ఆక్రమించుకోవడంతో రహదారులు ఇరుకుగా మారి ప్రజలు ఇబ్బందులు పడుతుండటంతో అధికారులకు ఫిర్యాదులు అందుతున్నాయి. ఈ విషయమై నగరపాలక సంస్థ, పోలీసు శాఖ సంయుక్తంగా దృష్టి సారించాయి. శ్రీకాకుళం డీఎస్పీ వివేకానంద, కమిషనర్, ట్రాఫిక్ సీఐ వి.నాగరాజు సిబ్బందితో కలిసి గురువారం మార్కెట్, కళింగ రహదారిలో పర్యటించి ఆక్రమణలను గుర్తించారు. రెండు రోజుల్లో తొలగించకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

## కేజీబీవీ నియామకాల్లో రోస్టర్ విధానం పాటించాలి

పొందూరు, పొందూరు గ్రామీణం, న్యూస్‌టుడే: జిల్లా సర్వశిక్ష అభియాన్ అధికారులు విడుదల చేసిన సీఆర్టీ, పీజీటీ, పార్ట్‌టైమ్ టీచర్స్ తదితర పోస్టుల నియామకాలపై డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు పూజారి హరిప్రసన్న, ప్రధాన కార్యదర్శి పేడాడ కృష్ణారావులు ఓ ప్రకటనలో అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రొవిజనల్ మెరిట్ జాబితాలో ఆంధ్రప్రదేశ్ స్టేట్ సబార్డినేట్ రూల్స్ 22, జీవో 77 ప్రాప్తికి మెరిట్ కమ్ రోస్టర్ విధానం పాటించకపోవడంతో రిజర్వుడ్ కేటగిరి అభ్యర్థులు నష్టపోతారని పేర్కొన్నారు. ఈ జాబితాలోని తప్పులను సవరించాలని అధికారులను డిమాండ్ చేశారు.